వార్త
ఆదివారం
18 ఫిబ్రవరి, 2024

# వన జాతరలో మేడారం పరవశం



తారాతీరం



# 'విశ్వంభర'లో మీనాక్షి చౌదరి?

'హిట్', 'ఖిలాడీ' సినిమాల తరువాత మీనాక్షి చౌదరి 'గుంటూరు కారం'లో మెరిసింది. ఇందులో ఆమె మహేశ్‌బాబు మరదలి పాత్రలో గ్లామర్ పరంగా మంచి మార్కులు సాధించింది. ఆ గ్లామర్ కారణంగానే ఇప్పుడు చిరంజీవి చిత్రంలో ఛాన్స్ కొట్టేసిందని తాజా సమాచారం. చిరంజీవి కథానాయకుడిగా శ్రీవశిష్ఠ 'విశ్వంభర' సినిమాను రూపొందిస్తున్నా డు. యూవీ క్రియేషన్స్ వారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో ముగ్గురు కథానాయికలు ఉండనున్నట్లు సమాచారం. ప్రధాన నాయిక పాత్రలో త్రిష కనిపించనుంది. మరో కథానాయికగా మీనాక్షి చౌదరినీ తీసుకున్నట్లు తెలుస్తోంది.

# మరోసారి జంటగా రామ్‌చరణ్-సమంత!



రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ చేంజర్' చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానాతో సినిమా చేయనున్నాడు. ఇందులో రామ్‌చరణ్ సరసన మరోసారి సమంత నటించనున్నట్టుగా తెలుస్తోంది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' హిట్ అయిన విషయం విదితమే. ఈ సినిమాతో వీరి కాంబినేషన్ హిట్ పెయిర్‌గా మారింది. ఇప్పుడు రామ్‌చరణ్ జోడీగా మళ్లీ సమంత పేరు వినిపించడం విశేషం. ఈ సినిమాకి సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వ్రిద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

ఆదివారం వార్త

18 ఫిబ్రవరి, 2024

## మంచి ముత్యాలు

ప్రేమ అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు, అపకారమును మనస్సున ఉంచుకొనదు.

బైబిల్

## విషయ విశేషం

ఖాతా హ్యాక్ అయితే?... 4

'సంఘీ'భావం....5

విస్తరిస్తున్న స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారం

కవర్ స్టోరీ..6

వనజాతరలో
మేడారం పరవశం

చెప్తే చాలు చేసేస్తుంది...10

ఈవారం కవిత్వం..12

బాల చంద్రిక

ఆన్‌లైన్ 'సంత'..14

భావోద్వేగ నియంత్రణ.....18

కథ.. 20

మంచు తుఫానులో బామ్మా మనవరాలు

సాహిత్యం..23

'వేయి పడగలు'కు 90 యేళ్లు

కృత్రిమ క్రిమికీటకాలు..25

ఖర్చులను నియంత్రించడం ఎలా...29

ఇంకా..

పుస్తక సమీక్ష


మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## హావభావాలను చెప్పే బాక్స్



ఆటబొమ్మ ఏదైనా సరే, చిన్నారుల్ని సరదాగా ఆడిస్తూనే కొత్త విషయం కూడా నేర్పించేలా ఉంటే మరెంతో బాగుంటుంది కదా. అయితే ఈ ఫీలింగ్ బ్లాక్స్‌ని ఒకసారి ప్రయత్నించి చూడండి. ఒకదానిపైన ఒకటి పేర్చుతూ రకరకాల ఆకారాలు తెప్పించే బిల్డింగ్ బ్లాక్స్‌లోనే ఇవో కొత్తరకం సంతోషం, బాధ, ఆశ్చర్యం, భయం ఇలా నవరసాల్ని చూపించే భావోద్వేగపు బ్లాక్స్ ఇవి. ఈ వుడెన్ బ్లాక్స్‌ల్లో రకరకాల ముక్కలు వస్తాయి. జుత్తు, కళ్లు, ముక్కు నోరు..ఇలా ఒక్కోదానిపైన ఒక్కో బొమ్మ గీసి ఉంటుంది. అవన్నీ వేరువేరు హావభావాల్ని చూపిస్తాయి. ఆ బ్లాక్స్‌ల్లో జుత్తు, కళ్లు, ముక్కు నోరు బొమ్మలు వచ్చేలా దానిపైన ఒకటి పేర్చితే..బొమ్మ మొత్తం ఏదో ఒక ఫీలింగ్‌ను తెలుపుతుంది. ఇలా అన్ని రకాల భావోద్వేగాల్ని ఆ బ్లాక్స్ ద్వారా చూపించేయొచ్చు. వీటి సాయంతో ఎమోషన్స్ గురించి పిల్లలకు సులువుగా నేర్పించొచ్చు.

## జోక్స్..జోక్స్..

**సుశీల:** భారతదేశంలో ఉన్న స్త్రీలు రెండు సమస్యల్ని ఎదుర్కొంటున్నారు నీకు తెలుసా?

**వనజ:** లేదు పిన్ని! ఇంతకీ ఏంటి ఈ సమస్యలు?

**సుశీల:** ఒకటి ఆమె కోడలుగా ఉన్నప్పుడు ఆమెకు అత్త నచ్చదు..ఆమె అత్త అయ్యాక ఆమెకు కోడలు నచ్చదు!

**వనజ:** నిజమే వదిన కరెక్టుగా చెప్పారు. మరి ఈ సమస్య తీరడం ఎలా?

**సుశీల:** ఏం లేదు. కోడలు రాకముందే అత్త చనిపోవాలి, లేదా కొడుక్కి పెళ్లి చేయకుండా ఉండాలి.

**వనజ:** చీపురుకట్టతో దిక్కుమాలిన సలహాలిస్తావా అంటూ వదినను తరిమి..తరిమి కొట్టేందుకు వెంబడించింది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ఖాతా హ్యాక్ అయితే?

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్..ఇలా ఎన్నెన్నో సామాజిక మాధ్యమాలు. అభిప్రాయాలు పంచుకోవటానికైనా.. చుట్టుపక్కల సమాచారాన్ని తెలుసుకోవటానికైనా ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వినోద, విజ్ఞానాల కోసమూ ఎంతోమంది వీటిపైనే ఆధారపడుతున్నారు. అయితే సామాజిక మాధ్యమ ఖాతాల హ్యాకింగ్ ఇటీవల పెరగటం కలకలం సృష్టిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా చాలామంది దీనికి గురవుతున్నారు. సెలబ్రిటీలు, రాజకీయ నేతలకు చెందినవే కాదు..మామూలు వ్యక్తుల ఖాతాలనూ డేటా చోరులు హ్యాక్ చేస్తున్నారు. దీన్నుంచి ఎలా కాపాడుకోవాలి?

## అన్ని పరికరాల్లోంచి సైన్ అవుట్

సామాజిక మాధ్యమ ఖాతాను ఎవరో తమ చేతుల్లోకి తీసుకొని, అసంబద్ధ విషయాలన్నీ పోస్ట్ చేస్తుంటే ఎవరికైనా మనసు కలుక్కుమంటుంది. ఇలాంటి సమయంలో ముందుగా చేయాల్సింది అన్ని పరికరాల్లోనూ ఆ ఖాతా నుంచి సైన్ అవుట్ కావటం. ఆటోమేటిక్ సైన్‌ఇన్స్‌తో హ్యాక్ చేసేవారి ఆటను దీంతో చాలావరకు కట్టించొచ్చు. పాస్‌వర్డ్‌లు అందుబాటులో లేకపోవటం వల్ల హ్యాకర్లు తిరిగి లాగిన్ కాలేరు.

## పాస్‌వర్డ్ మార్చుకోవాలి

సైన్ అవుట్ అయ్యాక ఒక పరికరం ద్వారా ఖాతాలోకి లాగిన్ కావాలి. అకౌంట్ లేదా సెటింగ్స్ పేజీలోకి వెళ్లి పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలి. హ్యాకర్లు మన పాస్‌వర్డ్‌ను దొంగిలించి ఉన్నట్టయితే ఇది కాపాడుతుంది. పాస్‌వర్డ్‌ను మార్చుకోవటం వల్ల వాళ్లు తిరిగి ఖాతాలోకి చొరపడటం సాధ్యం కాదు. కొందరు ఒకే పాస్‌వర్డ్‌ను ఇతరత్రా చాలా ఖాతాలకూ వాడుతుంటారు. ఒకవేళ ఇలాంటి పని చేస్తున్నట్టయితే ఇతర ఖాతాల సెటింగ్స్‌లోకి విధిగా పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలి. ఎందుకంటే హ్యాకర్లు దొంగిలించిన పాస్‌వర్డ్‌తో ఇతరత్రా ఖాతాలనూ హ్యాక్ చేయటానికి ప్రయత్నించొచ్చు. పాస్‌వర్డ్ మార్చుకుంటే ఇలాంటి ముప్పును తప్పించుకోవచ్చు. ఈసారి మరింత కఠినమైన పాస్‌వర్డ్‌ను నిర్ణయించుకుంటే భద్రంగా ఉండొచ్చు.



**రిపోర్టు చేయాలి:** కొన్నిసార్లు హ్యాకర్లు మన పాస్‌వర్డ్‌ను మార్చేయొచ్చు. దీంతో మనం లాగిన్ కావటానికి అవకాశముండదు. అప్పుడు ఫర్‌గాట్ మై పాస్‌వర్డ్ ఆప్షన్‌తో ప్రయత్నించొచ్చు.

ఇదీ పనిచేయకపోతే వీలైనంత త్వరగా సోషల్ మీడియా సంస్థకు రిపోర్టు చేయాలి. దీంతో హ్యాక్ అయిన మెసేజ్‌లు వెనక్కి వచ్చేలా చూసుకోవచ్చు. అంతా సురక్షితంగా ఉందని భావించేంతవరకు ఖాతాను స్తంభింపజేయొచ్చు. హ్యాకింగ్‌ను రిపోర్టు చేయటానికి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక పేజీలున్నాయి.

## కాంటాక్టులకు తెలియజేయాలి

ఖాతా హ్యాక్ విషయాన్ని మిత్రులు, బంధువులు, తెలిసినవారందరికీ తెలియజేయాలి. మనం పంపినట్టుగా స్పామ్ మెసేజ్‌లు, లింకులు అందొచ్చని..ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని క్లిక్ చేయొద్దని హెచ్చరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని క్లిక్ చేయొద్దని హెచ్చరించాలి. పరిస్థితులన్నీ కుదురుకున్నాక ఆ విషయాన్ని వారికి తిరిగి తెలియజేయాలి.

## ఎలా కాపాడుకోవాలి?

ఖాతా హ్యాక్ అయ్యాక చింతించటం కన్నా ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

**కఠిన పాస్‌వర్డ్‌లు:** పొడవైన, సంక్లిష్టమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్ సురక్షితం. కాబట్టి అక్షరాలు, అంకెలు, చిహ్నాలతో కూడిన కఠినమైన పాస్‌వర్డ్‌ను నిర్ణయించుకోవాలి. ఇందులో కనీసం 12 క్యారెక్టర్లు ఉండేలా చూసుకోవాలి. అన్నింటికీ ఒకటే కాకుండా వేర్వేరు ఖాతాలకు వేర్వేరు పాస్‌వర్డ్‌లను పెట్టుకోవాలి. పాస్‌వర్డ్‌లను సృష్టించుకోవటానికి, వాటిని స్టోర్ చేయటానికి పాస్‌వర్డ్ మేనేజర్లను వాడుకోవాలి.

**ఎంఎఫ్ఏ:** వీలైతే మల్టీఫ్యాక్టర్ అథెంటికేషన్ (ఎంఎఫ్ఏ)కు మారాలి. వేలిముద్ర వంటి బయోమెట్రిక్స్, సెక్యూరిటీ కీ, టెక్స్ట్ మెసేజ్‌లతో కూడిన ఇది 2ఎఫ్ఏ కన్నా మరింత భద్రత కల్పిస్తుంది. హ్యాకర్లకు పాస్‌వర్డ్ తెలిసినా ఖాతాలోకి ప్రవేశించలేరు.

## తెలియని లింకులు క్లిక్ చేయొద్దు

ఈమెయిల్‌కు, ఫోన్లకు అందే మెసేజ్‌ల్లోని లింకులను క్లిక్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. ముఖ్యంగా వెంటనే క్లిక్ చేయాలనే, భయపెట్టే లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మెసేజ్‌లను క్షుణ్ణంగా చదివి, వాటిని ఎవరు పంపించారో తెలుసుకోవాలి. దీంతో ఫిషింగ్ లింకుల వలలో పడకుండా చూసుకోవచ్చు.

(మిగతా 19వ పేజీలో)

## 'సంఘీ' భావం



# విస్తరిస్తున్న స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారం

ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన స్ట్రీట్‌ఫుడ్ ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరించింది. రోడ్డుపక్కన నిలబడి తినడం నామోషీగా భావించే మానసిక దృక్పథాన్ని వీడి ప్రస్తుతం విద్యావంతులు, ధనికులు కూడా స్ట్రీట్‌ఫుడ్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. పైగా ఈ స్ట్రీట్‌ఫుడ్ ఆయా ప్రాంతాల సాంస్కృతికి ఆహార పద్ధతులకు అద్దం పడుతుండటంతో వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పాశ్చాత్యదేశాల్లో సైతం స్ట్రీట్ ఫుడ్ వ్యాపారం అనూహ్యరీతిలో విస్తరిస్తూ ఉంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే లక్షా 60 వేల స్ట్రీట్‌ఫుడ్ దుకాణాలు ఉన్నట్లు జిహెచ్ఎంసి అధికారుల సర్వేలో తేలింది. ఇక్కడ రుచికరమైన ఆహారపదార్థాలు తక్కువ ధరలో లభించడమే కాకుండా త్వరగా భోజనకార్యక్రమం ముగించుకుని విధులకు వెళ్లే అవకాశం కలుగుతుంది. మధ్యాహ్నం సమయాల్లో దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో రోడ్డు పక్కన భోజనశాలలు వెలిశాయి. మధ్యాహ్నం భోజనానికి, రాత్రి వేళల్లో లభించే స్ట్రీట్‌ఫుడ్‌కు ఎక్కువ వ్యత్యాసం ఉంటోంది. మధ్యాహ్నం సమయంలో వివిధ కార్యాలయాలు, దుకాణాల్లో పనిచేసే వారు, విధినిర్వహణలో తిరిగే వారికి తప్పనిసరిగా స్ట్రీట్‌ఫుడ్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో లభించే స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారం అందుకు భిన్నంగా ఉంటోంది, ఉదయం వేళల్లో పనుల్లో బిజీబిజీగా గడిపి కొంత సేదతీరడానికి రాత్రివేళల్లో స్ట్రీట్‌ఫుడ్‌ను ఆశ్రయిస్తున్నారు. మధ్యాహ్నం సమయాల్లో ఎక్కువగా భోజనం విక్రయిస్తుండగా, రాత్రి సమయాల్లో స్నాక్స్, టిఫిన్ వంటివి ఎక్కువగా అమ్ముతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లో పనిచేసే స్ట్రీట్‌ఫుడ్ దుకాణాల్లో లభించే ఆహార పదార్థాల ధరలు స్టార్ హోటల్ ధరలతో పోటీ పడుతుంటాయి. అయినా వినియోగదారులు రోడ్డుపక్కన తినడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ వ్యాపారాలు సాధారణంగా రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లోనే వెలుస్తుంటాయి. ఈ సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. హైదరాబాద్‌లో కుమారి ఆంటీ హోటల్ కూడా ట్రాఫిక్ రద్దీ కారణంగానే వివాదాస్పదంగా మారింది. ఇక్కడికి పెద్ద సంఖ్యలో వినియోదారులు వచ్చి వాహనాలను రోడ్డుపై నిలిపివేయడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఈ హోటల్ వల్ల మరింత సమస్య ఏర్పడింది. దీనితో పోలీసులు వీటిని తొలగించారు. అయితే ఈ ఘటన వెనుక రాజకీయ వర్గాలు జోక్యం చేసుకోవడంతో తిరిగి హోటల్ నడుపుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఇక అప్పటి నుంచి మరింత సమస్యగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో సమస్య మరింత జటిలంగా మారింది. అసలే ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్న హైదరాబాద్ వంటి నగరాల్లో స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారం మరింత ఇబ్బందికరంగా మారింది. కూకట్‌పల్లి, మాదాపూర్, పంజగుట్ట, బేగంపేట వంటి కొన్ని ప్రాంతాల్లో నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి గంట సమయం పడుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారాన్ని ట్రాఫిక్ పోలీసులు నిలువరించగలిగారు. అయితే తాజాగా కుమారి ఆంటీ ఘటన తరువాత రాజకీయాల జోక్యం అధికంగా ఉంది. కుమారి ఆంటీ దుకాణం విషయంలో నేరుగా ముఖ్యమంత్రి స్పందించే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో తాము ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలని ట్రాఫిక్ విభాగం పోలీసులు వాపోతున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో లక్షా 25 వేల మంది వీధి వ్యాపారులకు జిహెచ్ఎంసి గుర్తింపు కార్డులు అందించింది. మరోపక్క కేంద్రప్రభుత్వం గత సంవత్సరంలో పదివేల రూపాయలు రుణం అందించింది. దేశంలోనే అత్యధికంగా రుణాలు తీసుకున్న వీధి వ్యాపారులు కలిగిన ప్రాంతంగా హైదరాబాద్ గుర్తింపు పొందింది. కేఎఫ్‌సి, డోమినోస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సైతం వీధి వ్యాపారాల పట్ల దృష్టి సారించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలంటే అద్దాల భవనాల నుంచి బయటకు రావాలన్న సిద్ధాంతాన్ని విశ్వసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవ్యారంగం, ఉత్పత్తి రంగం, మాల్స్ వంటివి దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంత కీలకంగా ఉన్నాయో ప్రస్తుతం కాలంలో స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారం కూడా ఆ స్థాయి చేరుకుంది. పైకి చిల్లర వ్యాపారంగా కనిపిస్తున్నా వాస్తవాలు పరిశీలిస్తే కోట్ల రూపాయల వ్యాపారం జరగడం ఆశ్చర్యం కలుగుతుంది. బెంగళూరు. ఢిల్లీ, చెన్నయ్, హైదరాబాద్, కలకత్తా వంటి నగరాల్లో ఒక వీధి వ్యాపారి రోజుకు రెండు నుంచి మూడు లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. బిటెక్, ఎంబిఏ చదివిన విద్యార్థులు నెలకు లక్షల రూపాయలు ఇచ్చే ఐటి కంపెనీలకు గుడ్‌బై చెప్పి మెడలకు ఉన్న టైలు విప్పి గరిటలు చేత పడుతున్నారు. బిటెక్ పానీ పూరీ అని, ఎంబిఏ చాయ్‌వాలా అని పేర్లతో రోడ్డుపక్క హోటళ్లను గర్వంగా నడుపుతున్నారు. వీధివ్యాపారాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉంది, అయితే వీటి వల్ల ప్రజల ఆరోగ్యానికి, దైనందిన జీవితాలకు అటంకం కలగకుండా చూడాల్సిన అవసరం కూడా అంతే ఉంది. ఎటువంటి నూనెలు, ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారన్న విషయంపై ఎటువంటి పరిశీలన ఉండటం లేదు. వీధి వ్యాపారుల ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ సంస్థలు ఆసక్తి చూపించడం లేదు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా స్థానిక పోలీసు స్టేషన్లకు చెందిన కొందరు సిబ్బంది నెలవారీ మామూళ్లకు అలవాటు పడి వీరికి మద్దతుగా ఉంటున్నారు. ప్రస్తుతం అసంఘటిత వ్యాపారంగా ఉన్న స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారాన్ని వ్యవస్థీకృతం చేసి స్పష్టమైన నిబంధనలు అమలు చేయాల్సి ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# వన జాతరలో మేడారం పరవశం



కవర్ స్టోరీ

**పెండ్యాల ఇందిరాదేవి,**
ములుగు రిపోర్టర్

**గిరిజనుల** సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టి, ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మలు తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి వరంగల్, ప్రస్తుత ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో కొలువైనారు. వరంగల్ జిల్లా కేంద్రానికి 110 కిలో మీటర్ల దూరం, ములుగు జిల్లా కేంద్రం నుండి 45 కిలోమీటర్లు ఉన్న మేడారం గ్రామంలో జరిగే ఈ జాతర ఆసియా ఖండంలోనే గిరిజన కుంభమేళగా పేరొందిన ఈ జాతర సమయంలో సుమారు కోటి మందికి పైగానే భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకుంటారు. కీకారణ్యంగా ఉండే మేడారం, జాతర సమయంలో జనారణ్యంగా మారుతుంది. గిరిజనుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడి తమ ప్రాణాలర్పించిన సమ్మక్క సారలమ్మలను స్మరిస్తూ ప్రతి రెండేళ్లకోసారి జాతర జరుపుకుంటారు. జాతర సమయంలో పురుషులు స్త్రీల వేషధారణలో తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు. శివసత్తుల పూనకాలతో శివాలెత్తుతారు. నాగరిక ప్రపంచానికి దూరంగా, ప్రకృతి అందాలతో అలరారే మేడారం జాతర ప్రతి రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున జరుగు తుంది. నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు గిరిజనులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వచ్చి శ్రీ సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని కొబ్బరి బంగారం (బెల్లం), పసుపు కుంకుమలు సమర్పించి తమ భక్తి భావాన్ని చాటుకుంటారు. తమ పిల్ల పాపలతో ఎడ్లబండ్లపై నాలుగు రోజుల పాటు సరిపడా సరుకులు వేసుకొని, దేవతలకు మొక్కు తీర్చుకునేందుకు కోళ్లు, యాటలను వెంట తీసుకొని వచ్చి వాటిని దేవతలకు సమర్పిస్తారు. సమ్మక్కలు సారలమ్మలు గద్దెను చేరుకునే ఘట్టం ఎంతో అద్భుతమైనది. ఆ మధుర ఘట్టాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు ఎగబడి చూసి తరించిపోతారు. అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్టించే సమయంలో అక్కడి వాతావరణం ఒక్కసారిగా ఆధ్యాత్మికంగా, భక్తి శ్రద్ధలతో పునీతమవుతుంది. గిరిజన పూజారులు చిలుకల గుట్ట నుండి అమ్మవార్లను కుంకుమ భరిణిలో గద్దెలకు తీసుకువచ్చి ప్రతిష్టిస్తారు. ఈ సమయంలో భక్తులు ఎదురెల్లి కోళ్లను ఎదురుకోడి ఇచ్చి పులకించి పోతారు. మేడారం జాతర లక్షలాది మంది భక్తుల విశ్వానికి ప్రతీక.., లక్షలాది మంది భక్తుల మది నిండా భక్తి భావం.., అమ్మలను తలుచుకుంటే అభయమిస్తారనే ధైర్యం.., పిల్లలు లేని వారికి సంతానం ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. కోరిన కోర్కెలు తీర్చిన దేవతలకు కృతజ్ఞ తగా వారి పిల్లలకు సమ్మక్క, సారక్క, జంపన్న అనే పేర్లు పెట్టుకుంటారు. మేడారం జాతర ప్రాంగణమంతా లక్షలాది మంది భక్తులతో కిక్కిరిసిపోవడమే గాక, భక్తులకు దేవుడు పూనకం రావడం, జయ జయ ధ్వానాలు, శివసత్తుల పూనకాలతో హోరెత్తుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, జార్ఖండ్‌ల తో పాటు సుమారు పది రాష్ట్రాల ప్రజలు మేడారం చేరుకొని సుమారు 10 కిలో మీటర్ల భక్త జనసందోహంతో నిండిపోతుంది.


జాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఇంచార్జీ మంత్రి పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీపీఓ, డిఎంఅండ్‌హెచ్‌ఓతో పాటు వివిధ శాఖల అధికారులు విధులు నిర్వహిస్తారు. జాతర సమయంలో నాలుగు రోజులు విధులు నిర్వర్తించడం తమ అదృష్టంగా అధికారులు భావిస్తారు. నాలుగు రోజులపాటు జాతరలో క్యాసెట్లలో అమ్మవార్ల పాటలు, పూనకాల పాటలతో మేడారం మార్మోగుతుంది. మేడారం జాతరలో భక్తితో పాటు విందులు వినోదాలు కలిగిన సంస్కృతి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

## మేడారం జాతర ప్రాశస్త్యం...

క్రీ.శ 1260 నుండి 1323 మధ్య కాలంలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లు (వరంగల్) ను రాజధానిగా చేసుకొని పరిపాలించేవాడు.

ఆ కాలంలో మేడారం ప్రాంతాన్ని కాకతీయ రాజులకు సామంత రాజుగా ఉన్న పగిడిద్ద రాజు పరిపాలించే వారు. అప్పటి కరీంనగర్ ప్రాంతాన్ని పరిపాలించిన మేడ రాజుకు ఈయన మేనల్లుడు. పగిడిద్ద రాజు భార్య సమ్మక్క అని చరిత్రకారులు చెబుతున్నారు. సమ్మక్క తల్లి పుట్టుక గురించి ఓ చిన్న కథ ప్రాచుర్యంలో ఉంది. మేడారం గ్రామంలో కోయ దొరలు గోదావరి తీరాన దట్టమైన అటవీ ప్రాంతంలోకి వేటకు వెళ్లినప్పుడు పెద్ద పులులు మధ్య ఆనందంగా ఒక పాప వారికి కనబడింది. ఆ పాపను కోయదొరలు తీసుకెళ్లి మార్గశిర పౌర్ణమి రోజున సమక్క అని నామకరణం చేసి పోషించసాగారు, ఈ పాప వచ్చినప్పటి నుండి అన్ని శుభాలు కలుగడం, దైవలీలు కనిపించడంతో ఆమెను గిరిజనులు దేవతలుగా కొలిచేవారు. సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి అడవిలో పాము కాటుకు గురైన వారిని బ్రతికించడం, రోగాల పాలైన వారిని ఆరోగ్యవంతులగా మార్చడం వంటివి చేయడంతో సమ్మక్కను దేవతగా కొలువసాగారు. ఆమె పెరిగి పెద్దదై యుక్త వయస్సుకు రాగానే పగిడిద్ద రాజుతో వివాహం జరిపించారు. పగిడిద్ద రాజు, సమ్మక్క దంపతులకు సారక్క, నాగులమ్మ, జంపన్న ముగ్గురు పిల్లలు కలిగారు. కాకతీయ రాజులకు కోయరాజులు సామంతులుగా ఉండేవారు. అప్పట్లో ఐదేళ్లపాటు వర్షాలు లేని కారణంగా కరువు కాటకాలు ఏర్పడి గిరిజనులకు తినడానికి తిండి లేక ఆకలితో అలమటించారు. కాకతీయ రాజులకు కప్పం కట్టే స్థితిలో లేనందున పగిడిద్ద రాజు కప్పం చెల్లించడానికి నిరాకరించాడు. దీనితో ప్రతాపరుద్రుడు కోపోద్రిక్తుడై మేడారానికి సైనికులను పంపించగా వారు మొదట ములుగు సమీపంలో ఉన్న లక్నవరం చెరువు వద్ద సైనిక స్థావరం ఏర్పాటు చేసుకొని గిరిజనులపై యుద్ధం ప్రకటించారు. పగిడిద్ద రాజు అతని కుమార్తెలు నాగులమ్మ, సారలమ్మ అల్లుడు గోవిందరాజు కలిసి కాకతీయ సైన్యాన్ని మేడారం సరిహద్దులోని సంపెంగ వాగు వద్ద అడ్డుకొని వీరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. కుమారుడు జంపన్న సంపెంగ వాగులో దూకి ఆత్మహత్య చేసుకోగా ఆనాటి నుండి ఆ వాగును జంపన్న వాగుగా పిలుచుకుంటున్నారు. తన భర్త, కుమార్తెలు, కుమారుడు మరణించాడనే వార్త విని సమ్మక్క యుద్ధ రంగానికి వచ్చి ఆదిపరాశక్తిగా మారి అపరకాళిగా విజృంభించి ఈటెలతో, బల్లాలతో కాకతీయ సైన్యాలను పరుగెత్తించి అంతమొందించింది. ఓటమి భయంతో కాకతీయ సైనికులు దొంగచాటుగా సమ్మక్కను వెనుక నుండి బల్లెంతో పొడువగా ఆమె యుద్ధ భూమి నుండి మేడారం గ్రామానికి ఈశాన్యంలో ఉన్న చిలుకల గుట్టకు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం కోయదొరలు ఎంత వెతికిన జాడకానరాలేదు. చిలుకల గుట్టపైన ఉన్న నెమలి నార చెట్టు మొదట్లో కుంకుమ భరిణి రూపంలో కనిపించింది. దానిని సమ్మక్క గుర్తుగా కోయ గిరిజనులు భావించి ఆమె తిరిగి వస్తుందని ఆశతో వేచి చూశారు. అప్పుడే ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరు వీరుడుగానే జీవించాలని, తమకు రెండు గద్దెలు ఏర్పాటు చేయాలని సమ్మక్క తల్లి అన్నట్లుగా ఆకాశవాణి మాటలు వినిపించాయి. అప్పటి నుండి మేడారంలో రెండు గద్దెలను నిర్మించి ప్రతి రెండేళ్ల కోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క సారలమ్మ జాతరను జరుపుకుంటున్నారు.





## 1968 నుండి ప్రభుత్వ అధీనంలోకి...

## 1996 లో స్టేట్ ఫెస్టివల్‌గా మేడారం...

మేడారం జాతరను 1968వ సంవత్సరంలో ప్రభుత్వం అధీనంలోకి తీసుకొని జాతరను నిర్వహిస్తుం డగా, 1996లో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫెస్టివల్‌గా ప్రకటించింది.

అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి భక్తులకు కావాల్సిన సౌకర్యాలైన స్నానఘట్టాలు, మరుగుదొడ్ల సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య చర్యలు, క్యూ లైన్‌ల ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఎడ్ల బండ్లు, వివిధ రకాల వాహనాలు, బస్సుల్లో వచ్చే భక్తులకు రోడ్డు సౌకర్యం, వాగుపైన రెండు వైపుల వచ్చిపోయే భక్తులకు బ్రిడ్జిల నిర్మాణం చేయడం జరిగింది. భక్తులకు సేద దీరడానికి అక్కడక్కడ షెడ్లు, హరిత టూరిజం ఆధ్వర్యంలో రూంలు నిర్మాణం చేశారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు హన్మకొండ నుండి మేడారానికి హెలీకాప్టర్ సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చారు.

చిలుకల గుట్ట నుండి సమ్మక్క, కన్నెపల్లి నుండి సారక్క... ఫిబ్రవరి 21వ తేదీ నుండి 24 వ తేదీ వరకు మేడారం జాతర వైభవోపేతంగా జరుగుతుంది. మాఘశుద్ధ పౌర్ణమి రోజున కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడిలో నాలుగవ గోత్రానికి చెందిన పూజారులు (ఒడ్డెలు) ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళ తాళాలతో మేడారం చేరుకొని అమ్మవారిని గద్దెపై ప్రతిష్టిస్తారు. అదేరోజు నాలుగవ గోత్రానికి చెందిన మరో పూజారి ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో ఉన్న గోవిందరాజులను, కొత్తగూడ మండలం పూనుగొండ గ్రామం నుండి సమ్మక్క భర్త పగిడిద్ద రాజును గద్దెలపై చేర్చుతారు. అదే రోజున రాత్రి పడిగాపూర్ ప్రాంతంలోని వనం గుట్ట నుండి అనుము తెచ్చేందుకు అక్కడికి వెళ్లి అక్కడి వెదురు చెట్టుకు గిరిజన సాంప్రదాయ రీతిలో పూజులు చేసి ఆ చెట్టును గద్దెల పైకి చేర్చుతారు. గురువారం మూడవ గోత్రం, ఐదవ గోత్రం చెందిన పూజారులు ఉదయం నుండి పూజలు ప్రారంభిస్తారు. మేడారంలోని సమ్మక్క గుడిలోకి మూడవ గోత్రానికి చెందిన చందా వంశీయులు, ఐదవ గోత్రానికి చెందిన సిద్దబోయిన వంశీయులు వెళ్లి పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. జలకపు వడ్డె, ధూవపు వడ్డెగా పిలువబడే గిరిజనులు తమ లాంచనాల మధ్య సమ్మక్క తల్లిని చిలుకలగుట్ట నుండి సమ్మక్క గద్దెకు కుంకుమ భరిణి రూపంలో తీసుకువస్తారు. ఈ సమయంలో లక్షలాది మంది భక్తులు భక్తి పారవశ్యంతో ఊడిపోతూ తల్లులకు మేకలను, కోళ్లను బలిస్తారు. భక్తుల తాకిడిని అరికట్టేందుకు వేలాది మంది పోలీసులు భారీ బందో బస్తు నిర్వహిస్తారు.



**మొక్కులకు కంక బియ్యం, ఒడివాల బియ్యం...**

మేడారం జాతరలో సమ్మక్క సారలమ్మ తల్లులు మొక్కులు చెల్లించుకోవడం కోసం కంక బియ్యం, ఒడివాల బియ్యంను సమర్పిస్తారు. జాతరకు వచ్చే భక్తులు ఒడివాల బియ్యం కొత్త బట్టలో పోసుకొని అందులో రెండు కొబ్బరి కుడుకలు, రెండు రవికలు, రెండు పోక వక్కలు, ఖర్జూరాలు, సెంటు సీసీ వేసుకొని నడుముకు కట్టుకొని అమ్మవార్లను దర్శించుకునే సమయంలో రెండు రవిక ముక్కలను తల్లులకు సమర్పించి, బియ్యాన్ని ఇంటికి తెచ్చుకుంటారు.

**ఫిబ్రవరి 21 నుండి 24 వరకు మేడారం జాతర...**

మేడారం జాతర సమ్మక్క సారలమ్మ తేదీలను పూజారులు ప్రకటించారు. ఫిబ్రవరి 21 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు జాతర నిర్వహిస్తారు. ఫిబ్రవరి 14న మండమలిగే పండుగతో అమ్మవార్ల మహాజాతర ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 21న గుడిమెలిగే పండుగతో పాటు సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు గద్దెలకు చేరుతారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవత గద్దెకు చేరుకుంటుంది. ఫిబ్రవరి 23న సమ్మక్క సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులకు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. ఫిబ్రవరి 24న దేవతలు వన ప్రవేశం చేస్తారు. ఫిబ్రవరి 28న తిరుగు వారం పూజలు నిర్వహించేందుకు పూజారులు నిర్ణయించారు.

**ఎడ్ల బండ్ల నుండి హెలీ కాప్టర్ వరకు...**

మేడారం జాతరకు వచ్చే భక్తులు 60 ఏళ్ల క్రితం ప్రధానంగా ఎడ్ల బండ్లపై పిల్లా పాపలతో కలిసి వచ్చి నాలుగు రోజులు ఉండి శ్రీ సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకునే వారు. జాతరకు ముందు వారం రోజుల నుండే వరంగల్, కరీంనగర్, ఖమ్మం, చత్తీష్ఘడ్, మహదేవ్పూర్, నల్లగొండ, మహారాష్ట్రలోని సిరువంచ తదితర ప్రాంతాల నుండి ఎడ్లబండ్లపై వచ్చి జాతర సమయానికి చేరుకునేవారు. ఎటు చూసిన ఎడ్ల బండ్లు కనిపించి చూసేవారికి కన్నుల పండుగగా ఉండేది. అయితే గత 30 ఏళ్ల నుండి ఆర్టీసీ బస్సులు, వివిధ రకాల వాహనాలు అందుబాటులోకి వచ్చి భక్తులకు మరింత సౌకర్యం కలిగింది. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు వివిధ రకాల వాహనాలపై వచ్చే వారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక భక్తులకు హెలీకాప్టర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

**జాతర అభివృద్ధికి రూ. 75 కోట్లు...**

మేడారం మహా జాతరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రేస్ ప్రభుత్వం రూ. 75 కోట్లు కేటాయించింది. ఆర్ అండ్ బికి రూ. 2 కోట్ల 80 లక్షలు, నీటి సరఫరా, సానిటేషన్కు రూ. 14 కోట్లు, దేవాదాయశాఖకు రూ. 1 కోటి 50 లక్షలు, పంచాయతీరాజ్ శాఖకు రూ. 4 కోట్ల 35 లక్షలు, మైనర్ఇరిగేషన్ రూ. 6 కోట్ల 11 లక్షలు, మెడికల్ అండ్ హెల్త్ రూ. 1 కోటి, ఐటిడిఏ ఇంజనీరింగ్కు రూ. 8 కోట్ల 28 లక్షలు, ఎన్పిడిసిఎల్కు రూ. 3 కోట్ల 96 లక్షలు, టిఎస్ఆర్టీసీకి రూ. 2 కోట్ల 25 లక్షలు, ఎక్సైజ్కు రూ. 20 లక్షలు, ఐఅండ్పీఆర్కు 50 లక్షలు, ఎనిమల్ హస్బెండరీకి రూ. 30 లక్షలు, టూరిజంకు రూ. 50 లక్షలు, పోలీస్ శాఖకు రూ.10 కోట్ల 50 లక్షలు, రెవెన్యూకు రూ. 5 కోట్ల 25 లక్షలు, డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసర్కు సానిటేషన్కు రూ. 7 కోట్ల 84 లక్షలు, ఫిషరీస్ రూ. 24 లక్షలు, ఫైర్ రూ. 20 లక్షలు, అటవీశాఖకు రూ. 20 లక్షలు, ఐసిడిఎస్కు రూ. 23 లక్షలు, ట్రైబల్ వెల్ఫేర్కు రూ. 4 కోట్లు కేటాయించారు. ఈ మేరకు మంత్రి సీతక్క ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటిడిఏ పీఓ అంకిత్, ఎస్పీ శబరీష్, దేవాదాయ శాఖ అధికారి రాజేందర్, డిపిఓ వెంకయ్య, డిఎంఅండ్హెచ్ఓ డా. అల్లెం అప్పయ్యలతో పాటు సుమారు 28 శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ జాతర పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మంత్రి సీతక్కతో పాటు దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండ సురేఖలు కూడా జాతర నిర్వహణపై ఫోకస్ పెట్టారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో జనవరి 31 వరకు పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో దాదాపు

పనులు పూర్తి కావచ్చాయి.

**జాతరను విజయవంతంగా నిర్వహిస్తాం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జాతరలో చేపట్టే అభివృద్ధి పనులకు గాను రూ. 75 కోట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. రోడ్లు, బస్టాండ్, జంపన్న వాగు స్నాన ఘట్టాలు, మరుగు దొడ్లు, త్రాగునీరు, పార్కింగ్, కూ లైన్‌లు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులు టీంలుగా ఏర్పడి భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగం నిషేధమని, దీనిని జాతరకు వచ్చే భక్తులు విధిగా పాటించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. ఇప్పటికే భక్తులు ముందస్తుగా అమ్మవార్ల దర్శనానికి వస్తున్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాలు ట్రాఫిక్ జాం ఏర్పడకుండా పోలీసులు బందో బస్తు నిర్వహిస్తున్నారని మంత్రి సీతక్క వివరించారు.

**మేడారం భక్తులకు అటవీశాఖ రుసుము లేదు...**

**అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



మేడారం వచ్చే భక్తులకు ఏటూరునాగారం అభయారణ్యం అటవీశాఖ రుసుము నుంచి మినహాయింపు ఇచ్చినట్లు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా పర్యావరణ రుసుమును నిలిపి వేసినట్లు ఆమె తెలిపారు. జాతరకు వస్తున్న లక్షలాది మంది భక్తులకు సమ్మక్క సారలమ్మలు దర్శనం చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతాన్ని వీలైనంత పరిశుభ్రం గా ఉంచాలని మంత్రి సురేఖ కోరారు.

**మేడారంలోని భక్తులకు సకల సౌకర్యాలు, కోటి మందికి పైగానే వచ్చే అవకాశం**

**మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేందర్**



సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించినట్లు కార్యనిర్వాహక అధికారి రాజేందర్ తెలిపారు. గతంలో కంటే ఈసారి భక్తులకు సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు అనుగుణంగా సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణ సౌకర్యం కల్పించామని, ఆర్టీసీ ద్వారా సుమారు 6 వేల బస్సులు ప్రయాణీకులను చేరవేస్తాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్నందున జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భక్తులు వివిధ రకాల వాహనాలలో వస్తున్నందున సరిపడా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో వచ్చే వాకిరి సైతం ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపొందించామని అన్నారు. జాతరలో బందోబస్తు నిర్వహించేందుకు సివిల్, సీఆర్పీ, స్పెషల్ పోలీసులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. జంపన్న వాగులో స్నానఘట్టాలు ఏర్పాటు చేశామని, భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నామని వివరించారు.

**జాతర విజయవంతంగా నిర్వహిస్తాం మేడారం జాతరలో ప్లాస్టిక్ నిషేధం**

**ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



మేడారం జాతరను అధికారులు, పూజారుల సహకారంతో విజయవంతం గా నిర్వహిస్తామని ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే గిరిజన కుంభమేళకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఫిబ్రవరి 21వ తేదీ నుండి 24 వ తేదీ వరకు జాతర జరుగుతుం దని ఆమె పేర్కొన్నారు. జాతరలో పోలీసులు, అధికారుల సమన్వయంతో నిర్వహణ జరుగుతుందని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు పారిశుద్ధ్యం, సానిటేషన్, వైద్య సేవలు అందించి ఎవరికి కూడా ఇబ్బంది కలుగకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటు న్నట్లు కలెక్టర్ వివరించారు. మేడారం జాతరలో ప్లాస్టిక్ బ్యాగులు నిషేధమని, పర్యావరణ పరిరక్షణకు జాతరకు వచ్చే భక్తులు సహకరించాలని తెలిపారు. ❍





# చెప్తే చాలు చేసేస్తుంది

కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో..క్లుప్తంగా సీఈఎస్. అమెరికాలో జరిగే ఈ ప్రదర్శన కోసం ఏటా ప్రపంచం మొత్తం ఎదురుచూస్తుంటుంది. శామ్‌సంగ్, ఎల్జీ వంటి బడా సంస్థలు తమ సరికొత్త పరికరాలని ఇందులోనే ప్రదర్శిస్తుంటాయి. అసలు అక్కడ ప్రదర్శనకి అవకాశం దక్కించుకోవడానికే ఎన్నో సంస్థలతో పోటీపడాలి. అలాంటి తీవ్ర పోటీలో ఆ కుర్రాడు వెనకపడ్డాడు. జెస్సీలియూ అన్నది అతని పేరు. చైనా నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డవాడు. అతను రూపొందించిన 'ఆర్1' అన్న ఆ పరికరానికి ఈసారి సీఈఎస్‌లో అవకాశం దక్కలేదు. అతనెంతో ప్రయత్నించగా ప్రదర్శన చివరి రోజు ఓ చిన్న హాలులో తన ప్రొడక్ట్ గురించి వివరించే అవకాశమిచ్చారు నిర్వాహకులు. దాన్ని అద్భుతంగా వినియోగించుకున్నాడు లియూ. 'ర్యాబిట్ ఆర్1!' అన్న తన పరికరాన్ని పరిచయం చేస్తూ అతను చేసిన 20 నిమిషాల ప్రసంగం-ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. అది విని, ఆ పరికరాన్ని తీసుకుని పరీక్షించిన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ళ అబ్బురపడ్డాడు. '2007లో ఆపిల్ అధినేత స్టీవ్‌జాబ్స్ ఐఫోన్‌లని ప్రపంచానికి పరిచయం చేసిన సందర్భంలాంటిదే అది కూడా! 'ర్యాబిట్ ఆర్1' అంతే సంచలనం సృష్టిస్తుంది' అంటూ కితాబిచ్చాడు. ఆయన జోస్యాన్ని నిజం చేస్తూ కేవలం వారంలోనే 50వేల పరికరాలకి ఆర్డర్‌లు వచ్చాయి. రావడమే కాదు 'ర్యాబిట్ ఆర్1'తో ఇక స్మార్ట్‌ఫోన్‌ల హవాకి తెరపడినట్టే అన్న మాట కూడా చక్కర్లు కొడుతోంది. స్మార్ట్‌ఫోన్ అంటే మనకి ఆప్‌లే గుర్తుకువస్తాయి. మెసేజికో ఆప్, కారు బుకింగ్‌కి ఒకటీ, సినిమాలకి ఇంకొకటీ, ట్రైన్‌కి ఒకటీ ఇలా చాలా ఉంటాయి వాటిల్లో. ప్రతిదాన్నీ వాడాలంటే కాస్తోకూస్తో చదువుకుని ఉండాలి. చదువురాని వాళ్లనీ అంధుల్నీ వృద్ధుల్నీ ఇవి ఇబ్బందిపెడతాయి.

అలాకాకుండా ఆప్‌లతో పనిలేకుండానే మనక్కావాల్సినవన్నీ చేసిపెడుతుంది. 'ర్యాబిట్ ఆర్1' పరికరం. ఐఫోన్‌లలోని సిరి, అమెజాన్ అలెక్సా, గూగుల్ అసిస్టెంట్-లు కూడా మనం అడగ్గానే కొన్ని పనులు చేసిపెడతాయి కదా అని అడగొచ్చు. వాటికి చాలా పరిమితులున్నాయి. ఉదాహరణకి అలెక్సాని ట్యాక్సీ బుక్ చేయమని అడిగితే ఓలా, ఉబర్ ఆప్‌లని చూపిస్తుందంతే. అందులో అడ్రెస్ వగైరాలు మనమే టైప్ చేయాలి. కానీ-'ర్యాబిట్ ఆర్1' అలా కాదు. చెప్పిన కొద్దిక్షణాల్లోనే మనం ఎక్కడికెళ్లాలో అక్కడికి బుక్ చేసేస్తుంది. ఈరోజు మీకేం వంట చేయాలో తోచలేదనుకోండి. అలాంటప్పుడు ఈ 'ర్యాబిట్ ఆర్1' పరికరంలోని కెమెరాకి మన ఫ్రిజ్‌ని తెరిచి చూపిస్తే చాలు. ఉన్నవాటితో మనం ఏమేం వంటలు చేయొచ్చో వాటి రెసిపీలతో సహా క్షణాల్లో చెప్పేస్తుంది. మీ ఎదురుగా ఓ కొత్త వస్తువో మీకు పెద్దగా పరిచయం లేని ఏ ప్రముఖుడి ఫొటోనో ఉందనుకుందాం. వాటి గురించి తెలుసుకోవాలంటే దాన్ని మీరు ఫొటో తీసి, గూగుల్ ఇమేజెస్‌లో పెట్టి వెతకాలి. కేవలం కొన్ని నిమిషాలైనా పట్టే పని అది. అదే బొమ్మని 'ఆర్ఒ'లోని కెమెరాకి చూపిస్తే కొన్ని క్షణాల్లోనే చరిత్రమొత్తాన్నీ చదివి వినిపించేస్తుంది. అరచేతికన్నా చిన్నగా ఉండే ఈ పరికరం ఇన్ని పనులు ఎలా చేయగలుగుతోందంటే.. 'ఏఐ'తోనే. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'చాట్‌జీపీటీ4' గురించి విని ఉంటారుకదా! మనం అడిగిన ఏ విషయంపైనైనా గూగుల్‌కన్నా లోతుగా సమగ్రంగా సమాచారాన్ని మనముందు పెట్టే 'ఏఐ' సాంకేతికత ఇది. దీన్ని 'లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎమ్) అన్న విధానంతో తయారు చేశారు. అంటే ప్రపంచంలోని వివిధ భాషలకి చెందిన మాటల్నీ, వాక్యాలనీ పుంఖానుపుంఖాలుగా కంప్యూటర్‌లోకి చొప్పించడం అన్న మాట. అలా అన్ని భాషలనీ తెలుసుకుంటుంది గనకే మనం ఏ ప్రశ్న అడిగినా కంప్యూటర్ చటుక్కున చెప్పేస్తుంది. కంప్యూటర్‌కి అలా మాటల్ని కాకుండా చేతల్ని నేర్పిస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన వచ్చింది శాస్త్రవేత్తలకి అంటే 'ఓ సినిమా షో బుక్ చేయాలంటే. స్టెప్1-సంబంధిత సైట్‌కి వెళ్లాలి. ఇలా కంప్యూటర్‌కి 'పనులు' నేర్పించడాన్నే లార్జ్‌యాక్షన్ మోడల్ (ఎల్ఏఎమ్) అంటారు. ❑



# మార్కెట్లో కొత్తగా..



## స్మార్ట్ పరుపు

ఇది చాలా స్మార్ట్ పరుపు. కావలసిన రీతిలో దీని మెత్తదనాన్ని లేదా గట్టిదనాన్ని మార్చుకోవచ్చు. ఇలా మార్చుకోవడానికి వీలుగా దీనికి ఒక బటన్ అమర్చి ఉంటుంది. సాధారణమైన పరుపులతో పోల్చుకుంటే దీని బరువు దాదాపు ఎనభై శాతం తక్కువగా ఉంటుంది. సాధారణ పరుపులలో వాడే స్ప్రింగులు, ఫోమ్ వంటివేవీ ఇందులో ఉండవు. దాదాపు 1.40 కోట్ల పాలీస్టర్ దారపు పోగులతో దీనిని తయారు చేయడం విశేషం. దీని బటన్‌ను ఉపయోగిస్తూ, పది కుషన్ లెవల్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కొరియన్ కంపెనీ 'ఆన్సిల్' ఈ పరుపును సీఈఎస్-2024 షోలో ప్రదర్శించింది. 'స్మార్ట్ స్ట్రింగ్ ఐ4' పేరుతో తయారు చేసిన ఈ స్మార్ట్ పరుపులో మరికొన్ని అదనపు సౌకర్యాలూ ఉన్నాయి.



## స్మార్ట్ గమ్మీస్

ఇది పోషకాల గుళికలు, త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా తయారైన స్మార్ట్ గమ్మీస్ ఇవి. ఏడు పోషకాలతో కూడి ఈ స్మార్ట్ గమ్మీస్‌ను ఫిన్లండ్‌కు చెందిన 'ఇలో స్మార్ట్ న్యూట్రిషన్' కంపెనీ విడుదల చేసింది. సాధారణమైన విటమిన్ మాత్రలైతే, అందరికీ ఒకేలాంటివి దొరుకుతాయి. వీటిని ఎవరి అవసరాలకు తగినట్లుగా వారి కోసం ప్రత్యేకంగా తయారు చేయించుకునే వీలు ఉండటం విశేషం. 38.9 కోట్ల కాంబినేషన్లలోని పోషకాల మోతాదులతో కూడిన ఈ స్మార్ట్‌పిల్స్‌ను కోరుకున్న రుచులతో త్రీడీ ప్రింటింగ్ ద్వారా ముద్రించుకోవచ్చు. నోటికి నచ్చిన రుచుల్లో దొరికే వీటిని నోట్లో వేసుకుని చప్పరిస్తే చాలు. శరీరంలోని పోషక లోపాలన్నీ సత్వరమే నయమవుతాయి. పోషకాల కాంబినేషన్లను బట్టి ఈ గమ్మీస్ ఒక్కో ప్యాక్ ధర, (రూ 1247 నుంచి రూ.1662) వరకు ఉంటుంది.



## ఆరోగ్య రక్షణ

వైఫై రూటర్‌లా కనిపించే ఈ పరికరం ఇంటిల్లిపాదికీ ఆరోగ్యరక్షణ కల్పిస్తుంది. అమెరికన్ కంపెనీ 'అల్ట్రాహ్యూమన్' ఈ పరికరాన్ని 'అల్ట్రాహ్యూమన్ హోమ్' పేరుతో రూపొందించింది. రీచార్జబుల్ బ్యాటరీ సాయంతో పనిచేసే ఈ పరికరాన్ని ఇంట్లో అనువైన చోట అమర్చుకుని, ఆన్ చేసుకుంటే చాలు. ఇది నిరంతరం ఇంటి వాతావరణంలోని మార్పులను గమనిస్తూ, యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేస్తుంది. ఇంట్లోని ఉష్ణోగ్రత, గాలిలో ప్రమాదకరమైన సూక్ష్మజీవులు, ధూళికణాలు, కార్బన్ కణాలు వంటివి ఏ మేరకు ఉన్నాయో కచ్చితంగా చెబుతుంది. ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా మార్చుకునేందుకు ఇది అందించే సమాచారం బాగా దోహపడుతుంది. 'అల్ట్రాహ్యూమన్' ఈ పరికరాన్ని త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. దీని ధర రూ.29,011 మాత్రమే.



# బాలచంద్రిక

ఒక బుజ్జిపిల్ల వాళ్లమ్మతో వస్తోంది
చూపుడు వేలు బిగించి పట్టుకొని
చుట్టూ చూస్తూ బుడిబుడిగా నడుస్తోంది
ఎందుకో ఏ వింత కనబడిందో
నా ముఖంలోకి ముఖం పెట్టి
చిటుక్కున నవ్వింది
నేనొక బాల భానుణ్ణై
నులివెచ్చని చూపుతో దీవించాను
ఒక మూరన్నర ముద్దబంతి మొక్కలా ఉంది
నుదిటిన పెద్ద కుంకుడు గింజంత
నల్లటి బొట్టు
తెల్లదనంపై పైచేయిగా
నల్ల నక్షత్రంలా
చూడముచ్చటగా ప్రకాశిస్తోంది
పసుప్పచ్చని పసిదుస్తుల్లో
పండిన మామిడి పిందెలా కదుల్తోంది
చెప్పులు మీద
రెండు బొమ్మలు రెండు పువ్వుల్లా ఉన్నాయి.
ఆ చిన్ని తల్లి తొడుక్కున్నందుకు
అవి రెట్టింపైన అందంతో
ముందుకెళ్తున్నాయి.
పోతూ పోతూ
తల వెనక్కి తిప్పి మళ్లీ చూసింది
ఆ చిట్టిపాపాయి
ఒక మూరన్నర బంగారపు కొండలా ఉంది.

**- రవి నన్నపనేని**

## పరిచయాలు పదిలం

ప్రపంచంలోని వింతలన్నీ ఒకేలా
వుండవు/ మనకు కనిపించేవి కొన్ని
కనిపించీ కనిపించకుండా పోయేవి
కొన్ని/ చేయి తట్టి/ హృదిని మెలిపెట్టి
అదృశ్యమయ్యేవి కొన్ని/ నీలోకి
జొరబడి/ నీలో మమేకమయ్యేవి కొన్ని
రోజూ నాలుగు మాటలు
మనసును నవ్వించి పోతాయి
అప్పుడప్పుడూ వాక్ శరాలు
మదిన గుచ్చుకొని వెళతాయి
రోదించటం/ తడి తగిలి తల్లడిల్లిన
హృదిని/ మరో సందడి తీగకు
ఆరేస్తాం./ ఒకనొక విఘాతం అగాథమై
దర్శనమిస్తుంది... ఐనా
లోకపు దినచర్య ఆగదు
చీకటి పడటం తెల్లారటం/ తినటం
పడుకోవటం../ చావూ పుట్టుకతో సహా
ఏదీ ఆగదు/ అంతా షరా మామూలే.
కానీ... కానీ... కానీ.../ నేల తల్లి
విత్తును దాచుకున్నట్టు/ కొన్ని
పరిచయాలు/ హృది గర్భంలో
పదిలమై/ మహా వృక్షమవుతుంటాయి!

**- డా॥ కటుకోఝ్వల రమేష్**

## ప్రేమ మందిరం

నువ్వు నీ ప్రపంచం
నీదనే లోకంలో బతకడం కంటె
చనిపోవడం మేలని అన్నది మనసు
అదే బాధ అదే వ్యధ
అదే చింత అదే నిరంతరం.
ఒక ప్రేమను పంచే నివాసం
ఒక ప్రేమ మందిరం/ ఉంటే ఎంత బాగుంటుంది
మనిషికి లోటేముంటుంది
అవే అపరిచతమైన ముఖాలు
ఎక్కడో బయలుదేరాను
ఇంకెక్కడికో చేరుకున్నాను.
ఓ ఆకాశంలో నివసించే దేవతలారా
నా కరిక పొరపాటు అంటారా
సుఖంతో నిండిన శీతల పవనాలు
నా ఇంటిని తాకితే తప్పంటారా
నీ ప్రపంచంలో ఉండే కంటె
ప్రాణం వదలడం సులభం కదా!

**- అరుణ్ డేనియల్**



ఈవారం కవిత్వం



## ఎర్రెర్రని 'బతుకువర్ణం'

ఇదివరలో 'హరితనానీలు' రాసిన బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి (బొఉమ) తాజాగా 'బతుకువర్ణం' కవితా సంపుటితో మన ముందుకొచ్చారు. 'బతుకు వర్ణం' కవితలో ప్రపంచమంతా ఘాటెక్కించిన గుంటూరు మిర్చిని వర్ణించారు. 'జగమంతా ఎర్రెర్రగా మెరుస్తున్నానంటే/ ఆ చలువంతా నేలతల్లిదీ..ఇంటిఇల్లాలిదే!/ గుంటూరు నా ఊరు..అందరినోళ్ల నా ఇళ్లు' అంటూ మిర్చిరైతుకు ముద్దుబిడ్డ అయిన గుంటూరు మిర్చి స్వగతం వినిపించారు. అనేక సామాజిక అంశాలకు, తన అనుభవాలను జోడించి కవితలల్లారు' చిన్నప్పటి మధురానుభూతులను రాశులుగా పేర్చారు. 'ఒకప్పుడు ఎలా ఉన్నావు? అని కుశలం అడిగేవాళ్లు/ ఇప్పుడు..ఎక్కడున్నావు? అని ప్రశ్నిస్తున్నారు/ ప్రశ్నలోనే కాదు తేడా..జవాబులోను వ్యత్యాసాలే' కనుమరుగవుతున్న మానవ సంబంధాలను దృశ్యీకరించిన తీరు ఇది. 'మంచె కాడ' కవితలో గ్రామీణ జీవన చిత్రం..'మట్టిచలువ' కవితలో మట్టిపల్లు కవి యొక్క అపారమైన ప్రేమను ఆస్వాదించవచ్చు. విత్తుపై రైతు పెత్తనం కరువైందని వాపోతాడు 'విత్తుపై పెత్తనం' కవితలో. ఇప్పటి తరానికి 'లాంతరు' అంటే తెలియదు. హృద్యమైన నాస్టాల్జియాకు అద్దం పట్టిన కవిత 'లాంతరు'. 'ఆత్మసాక్షి' కవిత చదవండి. 'బొఉమ' ఆత్మకథలా తోస్తుంది. సంపుటిలోని పాఠిక కవితల్లో మట్టివాసన, పల్లె పరిమళం, గుప్పుమంటుంది. ఆఘ్రాషించండి. **(బతుకువర్ణం, రచన: బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, వెల: రూ 100, ప్రతులకు బి.రామిరెడ్డి, వేణుగోపాలస్వామి ఆలయం ఎదురు, ఆత్మకూరు (పోస్ట్), గుంటూరుజిల్లా)** – రమణ వెలమకన్ని

## 'పద్యామృత వర్షిణి' చిక్కా రామదాసు



సహస్రపద్య కఠీరవ, ధారణావాచస్పతి చిక్కా రామదాసు, అసాధారణ జ్ఞాపకశక్తితో అనర్గళంగా పద్యాలు వినిపించి శ్రోతలను రంజింపచేయడమే కాకుండా, 'పద్యామృత వర్షిణి' ఖండకావ్యం, 'నవరస'భరితం నండూరి పద్యసంకలనం, 'సహస్ర పద్యసుధానిధి' వంటి రచనలు వెలువరించిన పద్య సాహితీ తపస్వి. 117 పద్యాలను ఆటవెలదులు, తేటగీతులు, కంద, సీస పద్యమాలగా 'పద్యామృత వర్షిణి' ప్రతి భావంతంగా వెలువరించారు.

ప్రస్తుత సమాజానికి అవసరమైన అంశాలను, సామాజిక స్పృహతో పద్యరూపకంగా ఈ పద్య సంపుటి సరళ సుందరంగా ప్రతిబింబింపచేస్తోంది. తెలుగు సాహిత్యకళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షునిగా సాహితీ, కళారంగాల కు విశిష్ట సేవలందిస్తున్న చిక్కా రామదాసు పద్య ప్రేమికునిగా, లబ్ద ప్రతిష్ఠులైన తెలుగు ప్రాచీన కవుల పద్య సౌరభాన్ని, మధురంగా శ్రావ్యంగా వినిపించి అలరించడం, భువన విజయం లో పింగళి సూరన్న పాత్రలో జీవించే వైదుష్యంతో పద్య కవితా రచనలో అడుగుపెట్టి, వ్యంగ్యచమత్కార భావయుక్తంగా, సామాన్య జనావళిని మేల్కొలిపే అంశాలను స్వానుభవంతో వ్యక్తీకరించడం అభినందనీయం.

**(పద్యామృత వర్షిణి, రచన: చిక్కా రామదాసు, వెల: అమూల్యం, ప్రతులకు: 1-6-212/65/35, ఇ.డబ్ల్యు.ఎస్, ఫేజ్-1, ఎమ్.సి.హెచ్.కాలనీ, వెస్ట్ పార్శీగుట్ట, ముషీరాబాద్, హైదరాబాద్)**

– యర్రమిల్లి

# పుస్తక సమీక్ష

మనసైన సామెతలు-మేలైన కథలు అంటూ కొల్లూరి సోమశంకర్ చక్కటి ముందు మాట రాసారు. దాదాపు 40 కథలున్నాయి. కడుపుచించుకుంటే కాళ్లమీద పడుతుంది. కుక్కతోక పుచ్చుకుని గోదావరి ఈదటం నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది. పండితపుత్రః నీవు నేర్పిన విద్యయే..పూజకొద్దీ పురుషుడు-దానం కొద్దీ బిడ్డలు, పెనిమిటి రాజ్యం తన రాజ్యం, పిల్లల రాజ్యం



## 'సామెతల! క'థ'న కుతూహలం'

పరరాజ్యం, బూడిదలో పోసిన పన్నీరు, ముంజేతి కంకణానికి అద్దమెందుకు, లోకోభిన్న రుచి, సంసారం గుట్టు, రోగం రట్టులాంటి గ్రామీణ జీవితంలో తరచూ మనం వినే సామెతల్ని తీసుకొని వాటిపై కథలు రాయడం అభినందనీయం అన్నికథలూ ఏకబిగువున చదివిస్తాయి. ఒక పన్నెండేళ్ల చిన్న బాలుడి మంచితనం, కష్టపడి పని చేస్తూ చదివే గుణం, నీరజను అమ్మమ్మగా పిలిచి సహాయపడటం ఉద్యోగాలు వరినా నిజాయితీగా పనిచేసే ఆదర్శ విద్యార్థిగా చూపే మంచి కథ 'పిట్టకొంచెం-కూతఘనం' (పేజి.68) కార్లు, విమానాలపై మోజుగల వికాస్-మాధవి, పుస్తకాలు ఇష్టపడే ప్రమీల ఎన్నో పుస్తకాలు కొంటుంది. భర్తకు సెల్‌ఫోన్ తప్ప వేరే ప్రపంచం వుండదు. షాపింగ్ మాల్‌లో కమల, విమల చూసిన అమ్మాయిగా గుర్తుపడతారు. డబ్బు, హోదా, చీరలు కొనే ధనికవర్గాల స్త్రీల తత్వం చెప్పేకథ ఇది. ఓ మంచి కథ సంపుటి ఇది. **(క'థ'న కుతూహలం, రచన: బిందుమాధవి మద్దూరి, వెల: రూ 124, ప్రతులకు: ఫ్లాట్‌నం.402, శ్రీముఖరెసిడెన్సీ, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్)** – తంగిరాల చక్రవర్తి

స్వర్గీయ డా॥కపిలవాయి లింగమూర్తి చివరి రచన 'జీవుడు దేవుడు'. ఇదొక అసామాన్యమైన అపూర్వ సంకలనం. కొన్నేళ్లుగా మన చుట్టు చోటు చేసుకుంటున్న వింతలూ, విడ్డూరాల్ని తన ప్రతిభతో వ్యాఖ్యానిస్తూ, ఆ వార్తల వెనుక ఉన్న

## విషయ పరిజ్ఞానం, శాస్త్రీయత



శాస్త్రీయతను శోధించి మన పురాణ గ్రంధాల్లోన్ని ఉపాఖ్యానాలతో సమన్వయం చేసి, నేటి సైన్సుతో సంధించి మనకందిస్తోన్న సమాచారం ఇది. వారు వివరిస్తోన్న విషయాలు, ఏపత్రికలో వచ్చాయి అన్న విషయం కూడా లింగమూర్తి ఈ సంకలనంలో ఉటంకించటం వారి శ్రద్ధకు నిబద్ధతకు తార్కాణం. కవలలు విచిత్రాహారులే కాదు, దేవతలు నిజంగానే ఉన్నారా! మనం చేసే పూజలు..దేవతలకందుతాయా! ప్రేత జీవులు, పునర్జన్మమానవాత్మ, ప్రేతత్వం వంటి ఎన్నో విషయాలను మనం తేలిగ్గా కొట్టి పారేయలేని వివరణలు. ఎన్నో ఉదంతాలలో నాస్తికులు కొట్టి పారేయలేని సమాధానాలు 'జీవుడు-దేవుడు'లో దొరకుతాయి. పూలలో కేసరాలు అండాశయం అమరిక అలా ఎందుకు ఉంటుంది. మనలోని అర్ధనారీశ్వరతత్త్వం, సంపర్కం లేకుండా వ్యాప్తి చెందే చీమలు, తేనెటీగలు తేళ్లజాతులు గురించి చదువుతుంటే పాఠకులు సంభ్రమాశ్చర్యాలలో మునిగితేలుతారు. **(జీవుడు-దేవుడు, సంకలనం: డా॥స్వర్గీయ కపిలవాయి లింగమూర్తి, సంపాదకత్వం: కపిలవాయి అశోక్‌బాబు, వెల: రూ 200, ప్రతులకు: ప్రముఖషాపుల్లో)** – కూర చిదంబరం



# ఆన్‌లైన్ 'సంతే'

తరిగొప్పుల వి.ఎల్లెన్ మూర్తి

**గంటల** తరబడి ఏరికోరి నచ్చిన వాటిని కొనుక్కునే ఓపికలేని వారంతా కూడా ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆధారపడు తున్నారు. ఐదుగురు నెటిజన్లలో ముగ్గురు ఇంట్లోనే ఎంచాకా ఇ-కామర్స్ సంస్థల ద్వారా కావలసినవి కొనేస్తున్నారు. చాలా మందికి షాపింగ్ చెయ్యాలంటే చాలా సరదాగా ఉంటుంది. ఒకప్పుడు షాపింగ్ వెళ్లి హ్యాపీగా వచ్చేవాళ్లు. కానీ రానురానూ షాపింగ్ అంటే చాలామంది ఇష్టపడటం లేదు. అలాగని కొనుగోలు చెయ్యడానికి మాత్రం ముందు వరసలోనే ఉంటారు. నగరాలలో షాపింగ్ చెయ్యడమంటే పెద్ద ప్రహసనంగా మారిం ది. పెరిగిన రద్దీతో ఐదు లేక పది కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రాంతాలకు వెళ్లడానికి సైతం గంటల తరబడి ట్రాఫిక్ లో ఇరుక్కుపోవాల్సి వస్తోంది. ఈ అవస్థలు కనిపెట్టి వినియోగదారులకు మరింత సులభయోగ్యంగా సరుకులను కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్ షాపింగ్ సుగమమైన మార్గం. ఆన్‌లైన్‌లో అయితే వేలకొద్ది.. ఉత్పత్తులు మన కళ్లముందు సాక్షాత్కారమవుతున్నాయి. కావాల్సిన వస్తువులను, వాటి ధరను ఇంట్లోనే కూర్చుని సెలక్ట్ చేసుకోవడం ద్వారా షాపింగ్ మాల్స్‌లో కాలయాపన తప్పుతోందని ఆన్‌లైన్ షాపింగ్ వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో కంప్యూటర్ కామన్ వస్తువుగా మారడంతో ఆన్‌లైన్ షాపింగ్‌కు సహజంగానే డిమాండ్ పెరుగుతోందనే భావన నిర్వాహకుల నుంచి సైతం వినిపిస్తోంది. ఆన్‌లైన్ మార్కెట్‌లో తక్కువ సమయంలోనే ఎక్కువ ఉత్పత్తులు కొనుగోలు చేయవచ్చుని..బయటకి వెళ్లాలంటే ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయించాల్సి వస్తుందని, అలాకాకుండా ఇంట్లోనే ఎంచక్కా కంప్యూటర్, , మొబైల్, టాబ్లెట్ ఇంటర్నెట్ ద్వారా షాపింగ్ చేస్తున్నామని చెబుతున్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం 24 గంటలూ ఉండటం కూడా అనేకులు ఈ వెబ్ కొనుగోళ్లకు అలవాటుపడటానికి ఓ ప్రధాన కారణంగా నిలుస్తోంది. పైగా ఆన్‌లైన్‌లో కొన్న వస్తువులు, ఆయా ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులే ఇంటికి తీసుకొచ్చి ఇస్తుండటం కూడా ఆన్‌లైన్ షాపింగ్‌కు నానాటికి ఆదరణను తెచ్చిపెడుతోంది.

నచ్చకపోతే వస్తువులను వెనక్కి పంపించేయడం, మరోకదాన్ని మార్చుకునే సౌలభ్యం కూడా ఆన్‌లైన్ మార్కెట్‌లో ఉంది. అంతేగాక బ్యాంకులు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా జరిపే షాపింగ్‌కు ప్రోత్సహకాలు ప్రకటిస్తుండటం కూడా ఆన్‌లైన్ వ్యాపారం దూకుడును పెంచుతోంది. మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, డిజైనర్ ఫర్నీచర్, గృహాలంకరణ వస్తువులు, దుస్తులు, ఆభరణాలు, యాక్సెసెరీస్, పాదరక్షల అమ్మకాలు ఆన్‌లైన్ మార్కెట్‌లోనే అధికంగా జరుగుతున్నాయి. డ్రెసెస్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఫర్నిచర్, హోంనీడ్స్, హౌస్ కీపింగ్ చివరికి సబ్బులు, పప్పులు, ఉప్పు కూడా ఆన్‌లైన్ మార్కెట్లో అమ్మేస్తున్నారు.

ముందు కొనాల్సినవి ఏంటనేవి అనుకున్న తర్వాత ప్రైస్ కంపారిజన్ సైట్లు, మొబైల్ రీచార్జ్ సైట్లు పరిశీలించాలి. వెబ్‌సైట్‌లో కంటే యాప్‌లో కొంటే కొన్ని మరింత తగ్గింపు ధరలకే అందిస్తుంటాయి.

అలాంటి ఆఫర్లు ఉన్నాయేమో సదరు ఈ కామర్స్ సైట్లలో ఆఫర్ల కోసం సెర్చ్ చేయాలి. ఉంటే సంబంధిత ప్రొమోకోడ్‌ను వస్తువుకు ధర చెల్లించే ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. అది మరిచిపోతే డిస్కౌంట్ వర్తించదు. ఫలానా బ్యాంకు డిబెట్, క్రెడిట్ కారుడ్లతో కొనుగోలు చేస్తే 5 నుంచి 10శాతం డిస్కౌంట్ అంటూ తరచుగా ఆఫర్ చేస్తుంటాయి. ఆయా కార్డుల ద్వారా కొనుగోలు చేయడం వల్ల మరింత ఆదా చేసుకోవచ్చు. నిజానికి ఆర్థిక మందగమనంలోనూ ఆన్‌లైన్ షాపింగ్ వృద్ధిపథంలో నడుస్తుండగా, దీనికి కారణం ఆయా ఈ కామర్స్ సంస్థలు



ప్రకటిస్తున్న డిస్కౌంట్లు, ఆఫర్లే. బహిరంగ మార్కెట్‌లోకి ఇంకా రాని వస్తువులు కూడా ముందే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటం, ప్రత్యేక సిల్క్ పేరిట రోజులు, వారాల దాకా అన్నిరకాల వస్తువులపై భారీ డిస్కౌంట్లను ప్రకటించడం చేస్తున్నాయి ఇ-సంస్థలు. ముఖ్యంగా పండగ సీజన్లలో ఈ డిస్కౌంట్లు, ఆఫర్ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం అందరి చేతుల్లోనే ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న మొబైల్స్ ఉండటంతో అంతా ఆన్‌లైన్ షాపింగ్‌మయమే. పుస్తకాలు, వారపత్రికలు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్ ఇలా ఒకే అడ్డాలో అన్నీ కొనుగోలు చేయవచ్చు. ఉదాహరణకు మీరేదైనా పుస్తకాన్ని కొనాలనుకుంటే సెలెక్ట్ చేయగానే దానికి సంబంధించిన మొత్తం వివరాల్ని చూడొచ్చు. ఫోన్‌కాల్ ద్వారా కూడా ఆర్డర్ చేయవచ్చు. నెటిజన్ల ఆదరణ పొందిన ఆన్‌లైన్ షాపింగ్ సైట్. డీల్స్, డిస్కౌంట్‌లతో మొబైల్స్, ట్యాబ్లెట్స్, కెమెరాలు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయవచ్చు. మీరుంటున్న సీటిలోని స్పెషల్ డిస్కౌంట్‌లతో ఉత్పత్తుల్ని సొంతం చేసుకోవచ్చు. రెస్టారెంట్‌ల్లో నోరూరించే వంటల దగ్గర్నుంచి బ్యూటీక్లినిక్‌ల్లో ఫేస్‌ప్యాక్‌ల వరకూ అన్నీ చూడొచ్చు. ఫేస్‌బుక్ ఐడీలో లాగిన్ అవ్వొచ్చు. డిస్కౌంట్‌లు కూడా ఉన్నాయి. ప్రజెంట్ ట్రెండ్‌కు అనుగుణంగా యూత్ మెచ్చే వారు కోరుకునే వస్తువులను ఈజీగా కొనుగోలు చేయవచ్చు. వీటిల్లో లేటెస్ట్ మోడల్ షూస్ యాక్సెసరీస్ అన్నీ అందుబాటులో ఉంటాయి. పాల డబ్బాతో మొదలు పిల్లలకు కావాల్సిన అన్నీ అందుబాటులో ఉన్నాయి. కుర్రకారు అభిరుచులతో గ్యాలరీలు కనిపిస్తాయి. బంగారం, వజ్రాల్ని కూడా సరికొత్త డిజైన్లను ఎక్స్‌ప్లోర్ చేసి వెతకొచ్చు. మీ ముఖకవళికలు సరిపడే సన్‌గ్లాసెస్ డిజైన్ సెలక్ట్ చేసుకుని సొంతం చేసుకోవచ్చు. డిస్కౌంట్‌లతో మొబైల్స్, ట్యాబ్లెట్స్, కెమెరాలు, లైఫ్‌స్టయిల్ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయవచ్చు. కావలసిన మేగజైన్లు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, కెమెరాలు, లైఫ్‌స్టయిల్ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయవచ్చు. కావలసిన మేగజైన్లు, ఎలక్ట్రానిక్స్, మొబైల్ వంటివన్నీ ఒకేచోట కొనుగోలుచేయవచ్చు. రోజూ బయటికెళ్లి మెస్‌లోనో, హోటల్‌లోనో తినాలంటే బోర్. వేడివేడి టీ నుంచి పరోటాలు, కూరలు, బిర్యానీ దాకా ఒకటేమిటి..అన్నిటినీ ఒక్క క్లిక్‌తో మీరున్న చోటికే తెస్తామంటున్నాయి ఈ కంపెనీలు. కొన్నాళ్ల క్రిందటి వరకూ ఆన్‌లైన్‌ను ఆశ్రయించేవారంతా షాపింగ్, ట్రావెల్‌తో పాటు సినిమా టిక్కెట్లకే ప్రాధాన్య మిచ్చేవారు. ఇ-వ్యాపారంలో విలువ ఎక్కువ ఉండే ట్రావెల్‌ది మొదటి స్థానం కాగా..ఫుడ్‌ది 3వ స్థానం. అందుకే గుర్తు పెట్టుకోలేనన్ని స్టార్టప్‌లు ఈ రంగంలోకి దిగుతున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డరంటే బిర్యానీ, పిజ్జా మాత్రమే. కానీ రకరకాల స్టార్టప్స్ ప్రవేశించాక..టీ, టిఫిన్లు, సమోసా, సూప్స్, సలాడ్స్, పరాటా, జొన్న రొట్టెలు వంటివన్నీ ఆన్‌లైన్‌లోకి వచ్చేశాయి. అమెజాన్ పోర్టల్ ఇప్పటికే కొన్ని రకాల ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, డ్రింకులను సైట్లో అమ్మకానికి పెట్టింది. ఆన్‌లైన్ మార్కెట్లో నిత్యావసర సరుకుల మార్కెట్ చాలా భారీగా పెరుగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పండుగలు పెళ్లిళ్ల సీజన్‌లలో సాధారణంగా షాపుల్లో కొనుగోళ్లు విపరీతంగా జరుగుతాయి. నగరాలలో జరిపిన సర్వేలో 80 శాతం పైగా వినియోగదారులు ఆన్‌లైన్ షాపింగ్ చెయ్యడానికి ఇష్టపడుతున్నారు. జబాంగ్, ఫ్లిప్‌కార్ట్, జోవీ, స్నాప్‌డీల్ వంటి ప్రఖ్యాత షాపింగ్ వెబ్‌సైట్లు కొన్ని ఆఫర్లు కూడా ప్రత్యేక సీజన్లలో వినియోగదారులకు ఇస్తుంటాయి. క్యాష్‌బ్యాక్, డిస్కౌంట్ కూపన్లు ఆన్‌లైన్‌లో షాపింగ్ మరింత చౌకగా మారుతోంది. పైగా మెట్రో, కాస్మోపాలిటిన్ నగరాల్లో అందుబాటులో ఉండే వెరైటీ, బ్రాండ్‌లు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఉండవు. కాబట్టి ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా కావల్సిన బ్రాండ్‌లో నచ్చిన వెరైటీని ఆర్డర్ చేసుకుంటున్నారు. చాలామంది ఆన్‌లైన్లో షాపింగ్ అనేది సులభంగా, సౌలభ్యంగా ఉండుట వలన కొద్దిగా షాపింగ్ చేయటానికి ఇష్టపడుతున్నారు.




కొన్నిసార్లు వారు అనవసరమైన వస్తువులు కొనుగోలు చేయుటవలన వారి సమయం, డబ్బు చాలా ఎక్కువగా ఖర్చు అవుతుందనే వాస్తవాన్ని గుర్తించలేరు. కావలసిన వస్తువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయటం, వాటి పేమెంట్ విషయంలో మాత్రం ఎక్కువగా మోసపోతున్నారు. వారిలో ఎక్కువగా ఇంటిలో నుంచి ఆర్డర్ల ఇచ్చే మహిళలే ఎక్కువగా ఉన్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాలకు సంబంధించి బ్యాంకుకు చెందిన ఇంటర్నెట్ వెబ్‌సైట్ నిజమైనదా కాదా అనే విషయం ప్రధానంగా గుర్తించాలి. అలాగే బ్యాంకుకు సంబంధించి లావాదేవీలు బయట నుంచి అంటే ఇంటర్నెట్ సెంటర్ల నుండి కాకుండా, స్వంత కంప్యూటర్ ద్వారా లావాదేవీలు పూర్తి చేయడం ఉత్తమం. షాపింగ్ కార్యకలాపాలకు సంబంధించి సంబంధిత వెబ్‌సైట్‌లో ఉన్న వర్చువల్ కీబోర్డును ఎంపిక చేసుకోవడం మంచిది. కానీ చాలామంది కంప్యూటర్ వద్ద ఉన్న కీబోర్డు ఉపయోగించడం వల్ల హ్యాకర్లు వాటి సమాచారాన్ని తస్కరించి, వాటి ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అలాగే క్రెడిట్, డెబిట్‌కార్డులకు సంబంధించి 'పిన్' నెంబర్‌ను బహిర్గతం చేయడం మంచిది కాదంటున్నారు. ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్లో పేరెన్నికగన్న సంస్థలు కూడా వినియోగదారులను అడ్డగోలుగా మోసం చేసే పరిస్థితులు నిత్యకృత్యం కావడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో వినియోగదారులు చేరుతున్నారు. ఆన్‌లైన్లో ఏదైనా కొనాలనుకునే వారు అన్ని జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలి. షాపింగ్ చేయాల్సిన వస్తువుల్ని బట్టి ఇంటర్నెషనల్, డొమస్టిక్ వెబ్‌సైట్లో చూడాలా అనేది డిసైడ్ చేసుకోండి. కొనుగోలు చేసే వస్తువుల్లో రకాలు ఉంటాయి. ఏది నచ్చితే అదే సెలక్ట్ చేసుకోండి. వెబ్‌సైట్లో అన్నీ వస్తువులు బాగున్నాయి కదా అని అన్నింటి మీద ఇష్టం పెంచుకోవద్దు. అలా అయితే మీ జేబుకు చిల్లు పడ్డట్లే. ఆన్ లైన్ షాపింగ్‌లో అన్నీ వస్తువులు ఒకసారి తీసుకోవద్దు. ఎందుకంటే సీజన్ బట్టి వస్తువులకు డిస్కౌంట్ వస్తుంది.

కథ

# తుమ్ము

ముకుందరావు భార్య ముక్తేశ్వరికి మూఢనమ్మకాలు ఎక్కువ. వాళ్ల కొడుకు మురళీ పరీక్షటైమ్ పరీక్ష రాయటానికి బడికి బయల్దేరుతున్నాడు. ముకుందరావు ఒక ముఖ్యమైన పనిమీద బయటికి బయల్దేరాడు. ఆయనకి తుమ్ము ముంచుకొచ్చింది. హాచ్ అని తుమ్మాడు.

అక్కడే వున్న అతని భార్య ముక్తేశ్వరి 'మీరు తుమ్మారు. బయటకు వెళ్లకండి. తుమ్ము మంచిది కాదు. కొద్దిసేపు ఆగి వెళ్లండి' అంది.



ముకుందరావుకి మూఢనమ్మకాలు లేకపోయినా, 'ముఖ్యమైన పనిమీద వెళ్తున్నాను కాబట్టి, ఆగకుండా, భార్య చెప్పిన మాట వినకుండా వెళితే ఏమవుతుందో ఏమో ఒకవేళ పని కాదేమొ ఎందుకైనా మంచిది ఆగివెళదాం' అని మనస్సులో అనుకొని, కుర్చీలో కూర్చున్నాడు.

ఇదంతా మురళీ గమనించి హాచ్ అని మురళి తుమ్మి 'నాకు తొమ్మిదింటికే పరీక్ష వుంది. అమ్మా నేను కూడా తుమ్మాను. నేను పరీక్షరాయటానికి వెళ్లను నేను కూడా కొద్దిసేపు ఆగి వెళ్తాను, ఇక్కడ కూర్చుంటున్నాను' అని స్టూలు మీద కూర్చున్నాడు.

'తొమ్మిదింటికే పరీక్ష అన్నావు. తొమ్మిది అవుతుంది. నువ్వు వెళ్లకపోతే ఎలారా? అక్కడ పరీక్ష టైమవుతుంది. కొద్దిగా ఆలస్యమైనా నిన్ను పరీక్ష రాయటానికి లోపలకి పోనివ్వరు' ఆందోళనతో కంగారు పెట్టింది ముక్తేశ్వరి.

'తుమ్మితే నన్ను నువ్వు పొమ్మన్నప్పుడు, తుమ్మితే నాన్నకి నువ్వు ఎందుకు పోనివ్వటం లేదు? నాన్నని ఆగి ఎందుకు వెళ్లమంటున్నావు? నాకు మంచిదైన తుమ్ము, నాన్నకి చెడ్డది అవుతుందా? తుమ్ము చెడ్డదైనప్పుడు అది అందరికీ అది వర్తించాలి కదా! నాకో న్యాయం, నాన్నకో న్యాయమా? ఇదేం న్యాయం?' ప్రశ్నలు గుప్పించాడు మురళి. ముక్తేశ్వరికి ఏం మాట్లాడాలో తోచలేదు. ముక్తేశ్వరి నోట్లో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. చివరికి ఎలాగో తెముల్చుకొని 'ఏమోరా! నాకు మూఢనమ్మకాలు ఎక్కువ. నువ్వు ఆలస్యం చేస్తే అక్కడ నీకు అనుమతి ఇవ్వరు. పరీక్ష రాయకుండా నిన్ను చేస్తారు. నువ్వు అన్యాయమైపోతావు. త్వరగా బయల్దేరు. ఇక నా మూఢనమ్మకాల్ని నేను వదులుకుంటాను. సరేనా' అని కొడుకు మురళిని త్వరగా బయల్దేరనిచ్చి, భర్తవైపు తిరిగి బయల్దేరినట్లున్నారు. ఆలస్యమైతే అసలు పనికాకుండా పోతుందేమో' అని భర్తని కూడా త్వరగా బయల్దేరనిచ్చింది.

నిజానికి పరీక్షకి ఇంకా చాలా టైముంది. ఊరికే అమ్మకి అబద్ధం చెప్పినందుకు, అమ్మకి మనసులోనే క్షమాపణలు చెప్పుకొని, అమ్మలో మూఢనమ్మకాలు వదిలినందుకు మురళి చాలా సంతోషించి, బడికి బయల్దేరాడు. తన కొడుకు తన భార్యలో మూఢనమ్మకాలు వదిలించినందుకు ముకుందరావు కూడా చాలా సంతోషించి బయటకు వెళ్లిపోయాడు.

**- మా.శ్రీ.రాజు**



# పసుల పాలపిట్ట వార్త ఆదివారం

## బాలగేయం

### పావురమా



కపోతమా కపోతమా
ఓ తెల్లని కపోతమా
ఒక్కసారి రావమ్మా
మా మాట వినవమ్మ
కపోతమా కపోతమా
శాంతికి ప్రతిరూపమా
విశ్వమంతా తిరుగమ్మా
శాంతి పాఠం చెప్పమ్మా
యుద్ధం జరుగుతోంది
బాంబుల వర్షం
కురుస్తోంది
ప్రాణనష్టం
జరుగుతుంది
ఆస్తినష్టం జరుగుతోంది
కపోతమా కపోతమా
వెంటనే వెళ్లమ్మా
యుద్ధాన్ని ఆపమ్మా
శాంతిస్థాపన చేయమ్మా

**- చాడా మునిశేఖరరెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎన్.నాగమణి,** నందికొట్కూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వలస పక్షులు ఎంత వేగంగా ప్రయాణిస్తాయి?**

**జవాబు: నాగమణి!** వలస పక్షుల్లో కొన్ని పగలు, కొన్ని రాత్రివేళ, మరికొన్ని రాత్రీ, పగలు కూడా ప్రయాణం కొనసాగిస్తాయి. పెలికాన్‌లు, కొంగలు రెండు పూటలా ప్రయాణిస్తాయి. నీటి పక్షులు, నీటి బాతులు, రోజీపాస్టర్స్, గ్రీస్ మొదలైనవి రాత్రివేళ మాత్రమే ప్రయాణిస్తాయి. వలస పక్షులు సాధారణంగా 500 నుంచి 900 మీటర్ల ఎత్తులో 30 నుంచి 100 మీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. 6 నుంచి 11 గంటల పాటు ఏగబిగిన ఎగురుతాయి. ఆర్కిటిక్ బ్లాక్‌పోల్, స్లెండర్ బిల్ వంటి పక్షులు 240 నుంచి 970 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతాయి.

**- పి.పురోహిత్,** నాందేడ్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. అనేక టాబ్లెట్ల మీద, ఇంజక్షన్ల మీద 'ఐపి', లేదా 'బిపి' అని ఉంటుంది. వీటి గురించి తెలుపగలరు.**

**జవాబు: పురోహిత్!** ఏ ఫార్మాస్యుటికల్ కంపెనీవారు అయినా ఇంజక్షన్‌లు, టాబ్లెట్‌లు, సిరప్‌లు మొదలైన మందుల తయారీకి కొన్ని ప్రామాణిక నిబంధనలను నిర్దేశించుకుంటాయి. ఈ నిబంధనలను అమలు పరుస్తారు. వీటిని కొన్ని దేశాలు కొన్ని రకాలుగా నిర్దేశించుకుంటాయి. ఇంజక్షన్/టాబ్లెట్ మీద 'ఐపి' అని ముద్రించి వుంటే 'ఇండియన్ ఫార్మకోపియా'లోని నిబంధనలకు అనుగుణంగా తయారైందని అర్థం. 'బిపి' అని ఉంటే 'బ్రిటిష్ ఫార్మకోపియా', 'యుఎస్‌పి' అని ఉంటే 'యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా', 'జెపి' అని వుంటే 'జపనీస్ ఫార్మకోపియా', 'ఇపి' అని వుంటే 'యూరోపియన్ ఫార్మకోపియా' నిబంధనలకు లోబడి తయారైన మందులు అని భావం. మందుల స్వచ్ఛతను, తయారీలో వాడే వివిధ రసాయనాల అవధులను నిబంధనలు సూచిస్తాయి.

నాటి పాతరాతియుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు మానవ పరిణామక్రమంలో ఊహించలేనంత సమూల మార్పులను చవిచూసింది ప్రపంచ మానవాళి. ఉరుకులు పరుగుల జీవితంలో నవ్వ నరుడికి విశ్రాంతి కొరవడింది. తెలియని దాని వెంట గుడ్డిగా పరుగు తీస్తున్నది నవయువత. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వైకుంఠం మనిషిని నిద్రపోనివ్వడం లేదు. ఆరోగ్యంగానే ఉన్నామనుకుంటున్న మనుషులకు ఏదో తెలియని వెలితి వెంటాడుతున్నది.



# భావోద్వేగ నియంత్రణ

డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి

క్షణక్షణం మారుతున్న భావోద్వేగాలు నరుడి మానసిక ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. భావోద్వేగ నియంత్రణ తెలిసినవాడే ఘనుడని వర్గీకరిస్తు న్నారు. గెలుపు, ఓటమి, ప్రమాదం, ప్రమోద, సంక్షోభ సమయాల్లో నియంత్రణ కలిగి మనిషి వ్యక్తం చేసే విధానమే అతని వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తున్నది. భావోద్వేగ నియంత్రణ తెలిసిన యువతను ఆకర్షణీయ వేతనంతో కూడిన ఉద్యోగాలు ఆహ్వానిస్తున్నాయి. ఆరోగ్యకర మానసిక స్థితికి జీవితంలో ఎదురవుతున్న పలు వాంఛనీయ, అవాంఛనీయ సందర్భాల్లో ఆత్మవిశ్వాసంతో సమతుల్యతతో ప్రవర్తించడం అనేది ఓ అద్భుత కళ అని నమ్మాలి. మన మానసిక ఆరోగ్యాన్ని వయస్సు, వృత్తి, లింగ, సామాజిక స్థాయి, ఆర్థిక వనరులు లాంటివి ప్రభావితం చేస్తున్నాయి.

## భావోద్వేగాలు పలు రకాలు

అనాదిగా మానవాళి అనుభవిస్తున్న ఆరుమౌళిక భావోద్వేగాలుగా భయం, ఆశ్చర్యం, కోపం, విచారం, సంతోషం, అసహ్యం అనే అంశాలను గుర్తించాం, సందర్భాన్ని బట్టి ప్రకటిస్తున్నాం. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధనల ప్రకారం నవ మానవుడు 27 రకాలైన భావోద్వేగాలను వ్యక్తం చేస్తున్నాడని తేల్చారు. విస్మయం, ప్రశాంతత, భయానకం, విచారం, వినోదం, ఆరాధన, సౌందర్యప్రశంస, కోపం, ఆందోళన, ఇబ్బందికర, విసుగు, గందరగోళం, తృష్ణ, అసహ్యం, తాదాత్మ్యనొప్పి, ప్రవేశం, ఉత్సాహం, ఆసక్తి, ఆనందం, వ్యామోహం, ఉపశమనం, శృంగారం కూడా కలిగి ఉంటాయని శాస్త్రజ్ఞులు తేల్చారు. భారతీయ సాంప్రదాయ వేదాల్లో సూచించిన నవరసాలు భరతనాట్యం, కథకళిలాంటి శాస్త్రీయ నృత్యాల ద్వారా కథను పలు పాత్రల మాధ్యమంగా రక్తికట్టించే విధంగా కళాకారులు వ్యక్తం చేస్తుంటారు. శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, బీభత్స, భయానక, అద్భుత, శాంతం అనబడే భావాలను నవరసాలుగా వర్గీకరించారు.



మాటలకన్న భావాలను వ్యక్తం చేయడానికే ఇలాంటి భావోద్వేగాలు అశాబ్దిక (నాన్‌వర్బల్) రూపంలో ఉపయోగపడుతున్నాయి.

భావోద్వేగ సమతుల్యత ప్రాధాన్యం పెరుగుతోంది. భావోద్వేగ సమతుల్యత సాధనకు శారీరక, ఆరోగ్యం, పోషకహారం తీసుకోవడం, దురలవాట్లకు దూరంగా ఉండడం, నిద్రకు తగు సమయమివ్వడం, నిత్యవ్యాయామం లాంటివి ఉపయుక్తంగా ఉంటాయి. శారీరక మానసిక శ్రేయస్సుకు ఆరోగ్యకర మానవసంబంధాలు, చురుకుగా ఉండడం, నవ్య నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవడం, సమాజహిత సేవలు చేయడం, వర్తమానంలో సంతోషంగా జీవించడం అలవర్చుకోవాలి. యోగా, ప్రాణాయామం, ధ్యానం, కృతజ్ఞతాభావం, సదాలోచనలను సమయానుకూలంగా మార్చుకోవడం, ఇంద్రియ నిగ్రహణ, శక్తిని పెంచుకోవడం, వాస్తవానికి దగ్గరగా కలలు కనడం లాంటివి ఆచరించడంతో పాటు అభ్యాసం చేయడం కూడా భావోద్వేగ

నియంత్రణకు దోహదపడతాయని గుర్తుంచుకోవాలి. ఆనందమయ క్షణాల్లో అమితానందంతో ఎగిరిపడకుండా సగర్వంగా నిదానంగా స్థితప్రజ్ఞతను ప్రకటించాలి. కోపావేశ సందర్భాల్లో నోటిని, చేతలను అదుపులో పెట్టుకోవడం మంచి వ్యక్తిత్వం అనిపించుకుంటుంది. సంక్షోభ సమయాల్లో ఆత్మవిశ్వాసంతో అధిగమించడం, జయాపజయాలను జీవితంలో భాగమని నమ్మడం, వైఫల్యాలను పెట్టుబడిగా చేసుకొని గెలుపుబాటలో నడవడం, అనారోగ్య సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవడం లాంటివి భావోద్వేగ నియంత్రణ సూత్రాలు వినియోగపడతాయి.



సానుకూల, ప్రతికూల సందర్భాల్లో నిబ్బరంగా ఉండటానికి ప్రయత్నిద్దాం. ఒత్తిడిని జయించడం అలవాటు చేసుకుందాం. మన ప్రతిస్పందన పట్ల జాగ్రత్తగా ఉందాం. ఆత్మవిమర్శకు ప్రాధాన్యం ఇద్దాం. మన జీవితాలను ఆనందమయం చేసుకునే చిట్కాలు మన చేతుల్లోనే ఉన్నాయని నమ్ముదాం. సుఖదుఃఖాలు, గెలుపు ఓటములు, కష్టనష్టాలు అందరి జీవితాల్లో ఉంటాయని తెలుసుకుందాం. భావోద్వేగాల నియంత్రణ ఆస్తి భవిష్యత్తును పటిష్ట పరుస్తుందని భావిద్దాం. గెలిచినపుడు కాలర్ ఎగరేయడం, ఓడినపుడు పాతాళంలో కూరుకుపోవడం అవలక్షణమని తెలుసుకుందాం. భావోద్వేగాల నియంత్రణ ఆస్తి భవిష్యత్తును పటిష్టపరుస్తుందని భావిద్దాం. గెలిచినపుడు కాలర్ ఎగరేయడం, ఓడినపుడు పాతాళంలో కూరుకుపోవడం అవలక్షణమని తెలుసుకుందాం. తీపి చేదు అనుభవాల సమ్మిళితమే జీవితమని, ఉన్నత జీవన విలువలకు భావోద్వేగ నియంత్రణ మంత్రాలు దోహదపడతాయని విశ్వసిద్దాం. అన్ని విజయాల కన్న ఆనందక్షణాలు మిన్నయని నమ్ముదాం. భావోద్వేగాల నావలో నియంత్రణ తెడ్డుతో విజయతీరాలు చేరుదాం.


## ఖాతా హ్యాక్..

**(4వ పేజీ తరువాయి)**

అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు: యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటే సురక్షితంగా ఉండొచ్చు. అందుబాటులోకి వచ్చిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసుకోవటం అన్నింటికన్నా తేలికైన, మంచి మార్గమని గుర్తుంచుకోవాలి. ఆటోమేటిక్ అప్‌డేట్ ఆప్షన్‌ను ఆన్ చేసుకుంటే మన ప్రమేయం లేకుండా వాటికవే అప్‌డేట్ అవుతాయి. మరచిపోతామన్న దిగులుండదు.

**అనూహ్య మార్పుల తనిఖీ:** సోషల్ మీడియా ఖాతాలో అనూహ్య మార్పులేమైనా జరిగాయేమో తనిఖీ చేయాలి. అకౌంట్ సెటింగ్స్‌లోకి వెళ్లి విచిత్రమైన వ్యాపార వివరాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. నకిలీ మెసేజ్‌లు, పోస్టులుంటే డిలీట్ చేయాలి. తేలికగా హ్యాక్ చేయటానికి నేరగాళ్లు వారి పరికరాలను జోడిస్తుంటారు మరి. అలాంటివి కనిపిస్తే వెంటనే తొలిగించాలి. ఖాతాహ్యాక్ అయినప్పుడు ట్రాక్ చేయటానికి, డేటాను దొంగిలించటానికి కొత్త యాప్‌లనూ యాడ్ చేస్తుండొచ్చు. వీటిని డిలీట్ చేయాలి. ప్రొఫైల్ ఫొటోను సరిచూసుకోవాలి.




టూఫ్యాక్టర్ అథెంటికేషన్ ఖాతాకు విధిగా టూఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ) పెట్టుకోవాలి. దీంతో ఖాతాలోకి లాగిన్ అయ్యేటప్పుడు మనల్ని ధ్రువీకరించుకోవటానికి ఈమెయిల్, ఫోన్‌కు ఆరు అంకెల కోడ్ వస్తుంది. దీన్ని ఎంటర్ చేస్తేనే ఖాతాలోకి లాగిన్ కావటానికి వీలవుతుంది. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇతరులకు తెలిసినా మన ఖాతాలోకి లాగిన్ కాలేరు.

హ్యాక్ లక్షణాలు ఇవీ

మనం సృష్టించని పోస్టులు పబ్లిష్ కాబొచ్చు. డైరెక్ట్ మెసేజ్‌లూ వెళ్తుండొచ్చు. వీటితో హ్యాకర్లు మన ఫాలోయర్లకు ఫిషింగ్ డీఎంలు, పోస్టులు పెడుతుంటారు. చాలావరకూ ఫాలోయర్లను లింకులు క్లిక్ చేయాలని కోరుతుంటారు. యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఏదైనా కొనాలని చెబుతుంటారు.

– మనది కాని ఈమెయిల్ ఐడీ, సోషల్ మీడియా డీఎం నుంచి ఈమెయిళ్లు, మెసేజ్‌లు వస్తున్నాయని స్నేహితులు, సన్నిహితులు, ఫాలోయర్లు చెప్పటం మరో లక్షణం.

కథ

# మంచు తుఫాన్‌లో బామ్మా మనవరాలు

మాలాకుమార్

అలారం చప్పుడుకు చిన్నగా కళ్లు తెరిచి, సెల్ ఆఫ్ చేయబోయింది కాళింది. అంతలోనే "అమ్మో! ఈరోజు కస్టమర్ కాల్, ఆ తరువాత వరుసగా మీటింగ్స్ ఉన్నాయి. ఇప్పుడు లేవకపోతే అత్తగారికి, ఆద్యకు వంటచేసి ఉంచలేదు. అసలు ఇప్పటికే బామ్మా మనవరాళ్లిద్దరూ లేచి వంటింట్లో వెతుక్కుంటున్నారేమో అనుకుంటూ, కంఫర్టర్ జరిపి లేచింది.

పక్కన సౌరభ్ నిద్రలో ఉన్నాడు. కాళింది ఫ్రెషప్ అయ్యి కిందికి వెళ్లింది. కాఫీ కలుపుకొని కిటికీ దగ్గరకు కుర్చీ జరుపుకొని కూర్చుంది. బయట ఇంకా మబ్బు మబ్బుగానే ఉంది. స్ట్రీట్ లైట్ వెలుగులో తెల్లగా, చిన్న చిన్న తుంపరలుగా పడుతున్న మంచు మెరుస్తూ కనిపిస్తోంది. కిటికీ గ్లాస్ డోర్‌లో నుంచి బయటకు చూసింది. ఆ చిరుచీకటిలో, స్ట్రీట్ లైట్ వెలుగులో రోడ్ అంతా తెల్లగా కనిపిస్తోంది. సన్నగా పడుతున్న మంచు బిందువులు మల్లెల వాన కురిపిస్తున్నట్లుగా ఉన్నాయి. మంచు కరిసే వేళలో మల్లె విరిసేనెందుకో.. అని కూనిరాగం తీస్తూ వెచ్చని కాఫీని ఆస్వాదిస్తోంది.

"ఆ... మల్లెలే కురుస్తున్నాయి. సాయంత్రం నుంచి రెండు రోజులు స్నో స్ట్రాం ఉంది. ఇంక అప్పుడేమి కురుస్తాయో" అప్పుడే నిద్ర లేచి వచ్చిన సౌరభ్ అన్నాడు కాఫీ కలుపుకుంటూ.

"ఏంటి సౌరభ్! కాస్త పాటైనా పాడుకోనీయవు" అని గుణిసింది గారాబంగా కాళింది.

"సరే సరే... తల్లీ! నీ ఇష్టం. ఎన్ని పాటలయినా పాడుకో. నేను ఈ తుఫాన్ తగ్గేవరకూ హోటల్‌లో ఉంటాను చెప్పానుగా! వీళ్లిద్దరూ ఇంకా లేవలేదా?" అడిగాడు.

"రాత్రంతా పాటలూ, డాన్స్‌లు చేసుకుంటూ ఉన్నారు. ఇక అప్పుడే లేస్తారా?" అంటూ ఓసారి అత్తగారి గదిలోకి తొంగి చూసింది. బామ్మా మనవరాళ్లిద్దరూ హాయిగా నిద్రలో ఉన్నారు. ఆద్య బామ్మ పక్కన ఎక్కడ ముడుచుకొని ఉందో కనిపించలేదు. "ఆద్యను విడిగా పడుకోనీయండి, దాని రూంలో.." అంటే ఇద్దరిలో ఎవరూ తన మాట వినరు. నేను ఇక్కడున్నన్ని రోజులూ నా దగ్గరే పడుకోనీయి అన్నారు అత్తగారు. ఆద్యా రాదు, బామ్మా బామ్మా అంటూ ఆవిడతోనే ఉంటుంది. ఓసారి వాళ్ల వైపు చూసి వంట గదిలోకి వెళ్లింది.

సౌరభ్ కాఫీ తీసుకొని పైకి వెళ్లినట్లున్నాడు.

కొద్దిసేపటి తరువాత అనసూయ, వెనకాలే మూడేళ్ల ఆద్య వచ్చారు.

వాళ్లను చూస్తూనే "ఆంటీ, మైక్రోవేవ్‌లో ఇడ్లీ ఉన్నాయి, మీరు తినేయండి. నాకిప్పుడు అరగంటలో కస్టమర్ కాల్ ఉంది. అదయ్యాక వచ్చి వంట చేస్తాను. ఆద్యా, ఇదో ఈ పాలు తాగేసి అల్లరి చేయకుండా ఆడుకో" అంది కాళింది.


ట్రావెల్ సూట్కేస్‌తో వచ్చిన సౌరభ్ తల్లిని చూసి "అమ్మా, బయట ఊళ్లో ఉన్న మా టీం వాళ్లను నలుగురిని పిలిచాను. వాళ్ల హోటల్‌లో ఉన్నారు. సాయంత్రం నుంచి రెండు రోజులు స్నో స్ట్రాం ఉంది. బయటకు వెళ్లలేం. అందుకని నేను కూడా హోటల్‌లోనే ఉంటాను. నువ్వూ, నీ మనవరాలూ అల్లరి చేయకుండా కాస్త బుద్ధిగా, జాగ్రత్తగా ఉండండి. ఏదైనా అవసరం అయితే కాళింది చూసుకుంటుంది" అన్నాడు.

"అంటే బయటకు వెళ్లలేమా?" అంటూ బయటకు చూసింది అనసూయ.

బయట సన్నగా మంచుతుంపరలు పడుతున్నాయి.

"మంచేమీ ఎక్కువగా లేదు కదా? బయటకు వెళ్లవచ్చేమో! ఓసారి బయటకు వెళ్లి మంచు పట్టుకోనా?" చిన్న పిల్లలా సంబరపడుతూ అడిగింది.

"అవునా? ఎక్కువగా లేదా? అయితే ఓసారి బయటకు వెళ్లిరా" అన్నాడు సౌరభ్ ఇడ్లీ తింటూ. అనసూయ తలుపు దగ్గరకు వెళ్లి తీయబోయింది. తెరుచుకోలేదు. గట్టిగా ఉంది. తలుపుకు ఉన్న గ్లాస్‌లో నుంచి ముందుకు వంగి చూసింది. తలుపు ముందు వరకూ మంచు తెల్లగా ఉంది.



"వాళ్లు మున్సిపాలిటీవాళ్లు కాదు. మనం డబ్బులు ఇచ్చి వాళ్లని పిలిపిస్తాం. ప్రతి నెలా 500 డాలర్లు కడతాం. అతను.. నీకు బందిపోటు, హంతకుడిలా కనిపించాడా? అంతా కవర్ చేసుకోకపోతే ఈ మంచులో ఎట్లా వస్తాడు మరి?" అన్నాడు సౌరభ్.

ఇంటిముందు రోడ్ అసలు కనిపించటం లేదు. అంతా తెల్లగా మంచు పరుచుకొని ఉంది.

"ఇదేమిట్రా! తలుపు తెరుచుకోవటం లేదు. నువ్వెట్లా వెళతావు? గ్యారేజ్ ముందు కూడా అంతా మంచు ఉంది" అంది గాబరాగా.

"తెలిసింది కదా!" నవ్వుతూ అని, "ఇప్పుడు అస్సలు బయటకు వెళ్లలేమమ్మా. బయటకు వెళితే ఫ్రీజ్ అవుతాం. కనుగుడ్లు దెబ్బ తింటాయి. నువ్వు కష్టపడి తలుపు తీసి బయటకు వెళ్లాలని చూడకు" అన్నాడు.

"మరి నువ్వెట్లా వెళతావు?" అని అడుగుతుండగానే బయట ఏదో నీడ కదిలినట్లనిపిస్తే అటు చూసింది. మనిషి కనిపించకుండా వంటినిండా నల్లటి బట్టలు, తలకు పెద్ద నల్లటి మంకీ క్యాప్, కళ్లకు పెద్ద పెద్ద కళ్లద్దాలు పెట్టుకున్న ఒకతను పెద్ద ఆయుధం లాంటిది ఏదో పట్టుకొని వరండా ఎక్కుతున్నాడు.

అతన్ని చూడగానే ఒక్క క్షణం మంచులో ఉన్నట్లు బిగుసుకుపోయింది. నోట మాట రాలేదు. గబ గబా సౌరభ్ దగ్గరకు వచ్చి "సినిమాలో చూపించే హంతకుడు లాంటివాడు ఎవరో వచ్చాడురా" అంది గుసగుసగా.

"హంతకుడా!" అని సౌరభ్ బిత్తరపోయి గబగబా తలుపు దగ్గరికి వచ్చి చూసాడు. అక్కడ క్లీనర్ తలుపు దగ్గర, వరండాలో ఉన్న మంచును పెద్ద పార లాంటి దానితో జరిపి కిందకు, పక్కకు వేస్తున్నాడు.

సౌరభ్ వెనకాలే "వద్దురా, అటు వెళ్లకు.. పోలీస్‌కు ఫోన్ చేయి" అంటూ గాభరాగా వచ్చిన అనసూయతో "అతను కిల్లర్ కాదు, క్లీనర్" అని నవ్వాడు.

ఇంతలోనే డబ్ డబ్ అని చప్పుడు చేసుకుంటూ ఓ పెద్ద బుల్డోజర్ లాంటి వెహికిల్ వచ్చి, ఇంటి ముందున్న మంచును ఎత్తి పక్కకు వేస్తుంటే వాళ్లను వింతగా చూస్తూ "అబ్బా, గుండె దడదడలాడిపోయింది. ఏమిటిరా? మరీ అట్లా బందిపోటులా అంత ముసుగేసుకొని వచ్చారు. మున్సిపాలిటీవాళ్లా? మన దగ్గర చెత్త తీయటానికి వస్తారు. అట్లా వచ్చారా?" కుతూహలంగా అడిగింది అనసూయ.

"వాళ్లు మున్సిపాలిటీవాళ్లు కాదు. మనం డబ్బులు ఇచ్చి వాళ్లని పిలిపిస్తాం. ప్రతి నెలా 500 డాలర్లు కడతాం. అతను నీకు బందిపోటు, హంతకుడిలా కనిపించాడా? అంతా కవర్ చేసుకోకపోతే ఈ మంచులో ఎట్లా వస్తాడు మరి?" అన్నాడు సౌరభ్.

"అంటే మంచు కాలం కాకపోయినా, మంచు పడకపోయినా కడతావా?" ఆసక్తిగా అడిగింది అనసూయ.

"మంచు లేకపోయినప్పుడు ఇంటి చుట్టూ గడ్డి తీసి, క్లీన్ చేయటం అదే లాన్ మూవింగ్ అవీ చేస్తారు. సంవత్సరమంతా ఏదో ఒక మెయింటెనెన్స్ ఉంటుంది కదా! అన్నీ వాళ్లే చేస్తారు. కొంత మంది ఒక ప్రైవేట్ అసోసియేషన్‌లా ఉండి ఇవన్నీ చేస్తారు" అని తల్లికి వివరంగా చెప్పి "గ్యారేజ్ ముందు క్లీన్ చేస్తారు కదా, ఇంక నేను వెళతానమ్మా" అని చెప్పి వెళ్లాడు సౌరభ్.

సౌరభ్ కారు తీసి వెళ్లాక, కాసేపు బయట వాళ్ల చేస్తున్నది చూసి లోపలికి వచ్చింది అనసూయ. కాల్ అయ్యాక వచ్చి వంట చేద్దామనుకుంది కాళింది. కానీ ఆ తరువాత మీటింగ్‌లతో ఎంత టైం తీసుకుంటుందో! వంట చేస్తే ఓ పనైపోతుంది అనుకొని తల్లీ-కొడుకుల సంభాషణ వింటూనే గబగబా వంట చేస్తోంది కాళింది.

కాళిందితో "అయ్య బాబోయ్! ఇంటి ముందు క్లీన్ చేయటానికి నెలకు దాదాపు 25000 రూపాయలు ఇస్తారన్నమాట" ఆశ్చర్యంగా అంది అనసూయ.

"ఇవ్వకపోతే మరి ఎవరు తీస్తారు అదంతా? అయినా మీరు అలా ఇండియన్ రూపాయల్లోకి మార్చుకొని చూడకండి ఆంటీ!" అంటూనే డైనింగ్ టేబుల్ సర్ది హడావిడిగా వెళ్లిపోయింది కాళింది. మీటింగ్స్‌నూ, మిగతా ఆఫీస్ పని ముగించుకొని సిస్టం మూసి, "ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఈ అల్లరి గ్యాంగ్ ఏదబ్బా?" అనుకుంటూ కిందికి వచ్చి "ఆద్యా ఎక్కడ? ఏం చేస్తున్నావు?" అని పిలిచింది. "ఇక్కడ పౌడర్ రూంలో మమ్మీ. బామ్మకు మేకప్ చేస్తున్నాను" అని జవాబిచ్చింది ఆద్య.

"బాత్‌రూంలో మేకప్ ఏమిటీ?" అంటూ రెస్ట్ రూం తీసి అద్దం ముందు కౌంటర్ మీద కూర్చున్న ఆద్య, ఎదురుగా నిలుచున్న అత్తగారిని చూసింది.

"నువ్వు ఈ బాత్ రూంను పౌడర్ రూం అంటారని చెప్పావుగా. అందుకని ఇక్కడ ఆద్య మేకప్ చేస్తానంటే సరేనన్నాను" అంటూ తన వైపు తిరిగిన అత్తగారిని ఓ క్షణం తెల్లబోయి చూసి, పక్కున నవ్వింది కాళింది.

"ఎందుకట్లా నవ్వుతావు? చిన్న పిల్ల. దానికొచ్చినట్లు చేసింది" అంటూ అద్దం వైపు తిరిగి, అద్దంలో తన మొహం నిండా ఉన్న పింక్ పౌడర్, పెద్ద బొట్టు, కళ్ల చుట్టూ మందంగా దిద్దిన ఐలైనర్, పెదాల నిండా రక్తం తాగినట్లున్న ఎర్రగా పులిమిన రెడ్ లిప్‌స్టిక్, విరబోసిన జుట్టుతో అచ్చం దయ్యంలా ఉన్న తన ఆకారం చూసుకుంటూ "కడిగేసుకుంటా నులే.. నువ్వేమీ నవ్వక్కరలేదు" అంది ఉక్రోషంగా అనసూయ.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

"కడిగేసుకుంటారా? ఆ మేకప్ పోవటానికి ఎన్ని నీళ్లు కావాలో తెలుసా? అయినా ఇప్పుడు నీళ్లు బంద్ అయితే ఏం చేస్తారు?" అంటూ ఆద్యను తీసుకొని బయటకు వెళ్లింది కాళింది.

అనసూయ మేకప్ అంతా శుభ్రంగా కడుక్కొని వచ్చి "ఇక్కడ నీళ్లు ఎప్పుడూ నీళ్లు బంద్ అవవు కదా? నీళ్లు బంద్ అవుతాయంటావేమిటి?" అడిగింది కోడలిని.

"ఎప్పుడూ కావాంటీ. కానీ ఈ మంచు తుఫాన్‌కు కరెంట్ ఫెయిల్ అయితే నల్లాలూ బంద్ అవుతాయి. ఇదో.. ఈ టార్చ్ లైట్ మీ దగ్గర ఉంచుకోండి. కరెంట్ పోతే భయపడకండి. ఈ లైటర్, ఫైయర్ ప్లేస్ దగ్గర ఉంచుతున్నాను.

కరెంట్ పోతే ఇది వెలిగిస్తాను" అంది కాళింది.

"కరెంట్ పోతుందా? అయినా ఒక్క పూట పోతే ఏమవుతుంది? మా ఇండియాలో అయితే ఎప్పుడూ పోతూనే ఉంటుంది. నాకలవాటేలే.. ఏమీ భయపడను" అంది అనసూయ.

"అక్కడ కరెంట్ పోతే తలుపులు తీస్తాం, గాలి వస్తుంది. ఇక్కడ తలుపులు తీయలేం. తలుపు తీస్తే గడ్డకట్టిపోతాం. ఒక్క నీటి చుక్క కిందికి పడేలోపు మంచుగడ్డ అయిపోతుంది. ఈ చలికి నీళ్ల పైప్‌లల్లో గడ్డ కట్టిపోయి, పైప్‌లు పగిలిపోతాయి. ఎక్కువసేపు గాలి లేకుండా ఇంట్లోనే ఉంటే మనుషులు చచ్చిపోతారు. ఇక్కడ ఈ సీజన్‌లో కరెంట్ పోతే కష్టం" అని కాళింది చెపుతుండగానే పెద్దగా సైరన్ ఇస్తూ ఇంటి పక్క నుంచి వ్యాన్, దాని వెనుక ఫైర్ ఇంజిన్ వెళ్లాయి.

ఉలిక్కిపడి "ఇదేమిటి?" అంది భయం భయం అనసూయ.

ఆద్య కాళిందిని గట్టిగా కరుచుకుంది.

"ఎక్కడైనా ఈ మంచు మీద కార్లు జారిపడిపోతుంటాయి. అందుకని ఏ కారు అయినా జారి పడిపోయిందేమోనని చూసుకుంటూ అట్లా గస్తీ తిరుగుతుంటారు పోలీసులూ, ఫైర్ డిపార్ట్‌మెంట్‌వాళ్లు. ఏ ఆక్సిడెంట్ జరగకుండా ముందు జాగ్రత్తగా అన్నమాట" అని చెప్పింది కాళింది.

సాయంత్రం అయిందింటికే పూర్తిగా చీకట్లు కమ్ముకున్నాయి. దట్టంగా మంచు కురుస్తోంది. డిన్నర్ రెడీ చేసి పిలవటానికి వస్తే బామ్మా, మనవరాళ్లిద్దరూ బిక్కుబిక్కుమంనుకుంటూ మంచం మీద కూర్చొని బయట పడుతున్న మంచును చూస్తున్నారు. అనసూయ హనుమాన్ చాలీసా చిన్నగా చదువుకుంటోంది.



హడావిడిగా ఎప్పుడూ ఏదో అల్లరి చేస్తూ ఉండే వాళ్లిద్దరూ అలా కూర్చొని ఉండటం చూస్తుంటే మరీ భయపెట్టానా? అని ఓ పక్క జాలి, మరోపక్క నవ్వూ వచ్చాయి కాళిందికి. "ఇప్పుడేమీ ప్రమాదం జరగలేదు, కాస్త రిలాక్స్ అవ్వండి ఇద్దరూ. హాయిగా డిన్నర్ తిని పడుకోండి" అంది నమ్రత నవ్వుతూ.

రెండో రోజు సాయంకాలానికి మంచుతుఫాన్ వెలిసింది. మామూలుగా సన్నని మంచు పడుతోంది. సౌరభ్ ఇంటికి వచ్చాడు. సౌరభ్‌ను ఆత్రంగా పట్టుకొని "అక్కడ మీకేమీ ఇబ్బంది కాలేదు కదా నాన్నా?" అడిగింది అనసూయ.

"ఒక అయిదు నిమిషాలు కరెంట్ పోయింది. అందరినీ రూంలల్లో నుంచి లాంజ్‌లోకి రమ్మని అనౌన్స్‌మెంట్ చేసారు. అందరమూ లాంజ్‌లోకి వచ్చాం. కరెంట్ రాగానే మా రూంలల్లోకి వెళ్లిపోయాం.

హోటల్‌లో పోలీసులు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్ అన్నీ రెడీగా ఉంచారు. అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు" అన్నాడు.

"హమ్మయ్య.. ఈ మంచుతుఫాన్ ఏ ఇబ్బందీ పెట్టకుండా వెళ్లిపోయింది" అంది సురభి గుండెల మీద చేయి వేసుకొని.

"ఎలక్ట్రిసిటీ, వాటర్, పోలీస్, ఫైర్... ఇన్ని డిపార్ట్‌మెంట్‌లవాళ్లు కలిసి మనకు ఏ ఇబ్బందీ లేకుండా చేసారు. అందరి సహకారంతో అంతా క్లియర్ అయ్యి, మనమూ మామూలుగా తిరగగలుగుతున్నాం. ఏ ఒక్కరూ సరిగ్గా చేయలేకపోయినా ఒకరికొకరు సహకరించుకోలేకపోయినా జన జీవనం అస్తవ్యస్థం అయ్యేది. మరి నీ మంచుమురిపెం తీరిందా?" అడిగాడు సౌరభ్.

కొడుకు మాటకు జవాబివ్వకుండా బయటకు చూసింది సురభి.

జల్లులా మంచు వుండీ వుండి కురుస్తోంది. వెనుక ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీదంతా తెల్లని దూది రాసులుగా పోసినట్లు అందంగా కనులకింపుగా ఉన్నాయి ఆ చెట్లు. మధ్యాహ్నం రోడ్ అంతా క్లీన్ చేసినట్లున్నారు. రోడ్‌కు రెండు వైపులా మంచుకొండలా పడి ఉంది. ఆ రెండు కొండల మధ్య రోడ్ నల్లగా మెరిసిపోతూ శుభ్రంగా ఉంది. తెల్లగా, నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉన్న ఆ ప్రకృతిని చూస్తూ "బయట చూడు.. ఎంత బాగుందో. ఆ చెట్లను చూస్తుంటే హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్న మునీశ్వరులలాగా ఎంత నిశ్చలంగా, గంభీరంగా ఉన్నాయో!

హిమాలయాలను చూడాలన్న నా కోరిక ఇట్లా తీరింది. ఎంత చూసినా ఆ మురిపెం తీరదురా. ఈసారి మీ డాడీని కూడా రమ్మనాలి" అంది పరవశంగా ఆ మంచును చూస్తూ. అత్తగారి పరవశం చూస్తూ "హిమగిరి సొగసులూ మురిపించెను మనసులూ" అని రాగం తీసింది కాళింది. ●


## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:
నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# 'వేయి పడగలు'కు 90 యేళ్లు

**జయసూర్య**




కవి సమ్రాట్, భారతీయ జ్ఞానపీఠ పురస్కార బహుమతి గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు' తెలుగు సాహిత్యంలో అజరామరమైన కీర్తి శిఖరంపై వున్న మహా నవలా రాజం. 1895 సెప్టెంబరు 10న జన్మించి, 1976 అక్టోబరు 18న పరమపదించిన విశ్వనాథవారి సాహితీ విరాట్ స్వరూపం, సనాతన ప్రాచీన భారతీయ ఆత్మను కదిలించి, సమాజాన్ని జాగృతి పరిచిన మహాత్వ్య మహనీయ శకాన్ని, తరాన్ని మేల్కొలిపింది. 1934లో సరిగ్గా 29 రోజులలో 999 అరటావుల మీద విశ్వనాథ ఆశువుగా చెప్తుంటే సోదరుడు వేంకటేశ్వర్లు గ్రంథస్థం చేసిన 'వేయి పడగలు'కు ప్రస్తుత సందర్భంలో 90 ఏళ్ల వచ్చాయి.

1937-38లలో ఆంధ్రపత్రిక వారపత్రికలో, 1987-88లలో తిరిగి అదే పత్రికలో ధారావాహికగా ప్రచురింపబడిన వేయి పడగలు, విశ్వనాథ మహోన్నత సాహితీ ప్రతిభా సంపన్నతకు ఒక మణిదీపం. భారత ప్రధానిగా, బహు భాషా కోవిదునిగా మహనీయ మేధావి డా॥ పి.వి. నరసింహారావు 1968 ప్రాంతాలలో ఈ నవలను హిందీలోకి అనువదించి జగత్ప్రసిద్ధిగా కీర్తిమంతం చేసారు. ఆ అనువాదం 'సహస్రఫణ్' పేరిట దూరదర్శన్ ప్రసారాలు, ప్రపంచ నవలా సాహిత్యంలో తెలుగు భాషకు గౌరవార్హతల పెద్ద పీట లభించింది.

**"వేయి పడగల పాము విప్పారుకొని వచ్చి కాటందుకున్నది కలలోన రాజును"**

మొదటి అధ్యాయం తొలి వాక్యాలతో ప్రారంభమైన ఈ నవల భారతీయ ప్రాచీన విజ్ఞాన సర్వస్వం ప్రధానంగా కుటుంబ వ్యవస్థలో దాంపత్య సంబంధ బాంధవ్యాన్ని సహస్ర ముఖాలుగా చదివింపచేసే అపూర్వ నవలా కావ్యం. 21వ శతాబ్ది ప్రస్తుత కాలంలో ఆధునిక సమాజం అనుభవిస్తున్న వాతావరణాది ఎన్నో కాలుష్య దుష్పరిణామాలను విశ్వనాథ, ఈ నవలలో వైజ్ఞానిక భవిష్య దార్శనికునిగా హెచ్చరించారు. విశ్వనాథ ప్రాచీన-ఆధునిక కాల ప్రవాహంలో మానవ జీవన సమాజ గతిని నవలా రూపంగా చదివింపచేసిన వేయి పడగలు 999వ పుటలో ముగింపుగా-

"ఆహా! ఇంక నేమి మిగిలినది? ఇంక నేమి మిగిలినది?" అంటూ భారతజాతి యింతగా ఎందువలన దైవోపహతమైనదంటూ భక్తి ప్రపత్తులు, సేవ, భూత దయ, పరోపకార సద్బుద్ధి మూర్తీభవించిన నాటి సమాజం కనుమరుగైపోతోందనే ఆవేదన అక్షరబద్ధంగా వ్యక్తీకరించారు. "అవును నీవు మిగిలితివి" అని వేయి పడగలు నవలలో ఆఖరి వాక్యాలు. ఈ విధంగా మొదటా చివరా నిర్దేశించిన భావజాలాన్ని బట్టి ప్రధానంగా కావ్య అంతరార్థాన్ని, కవి హృదయాన్ని, కావ్య ప్రయోజనాన్ని కొంతైనా అర్థం చేసుకోవచ్చు.



ఈ నవలలో ప్రతీ పుటలో ధర్మ ప్రస్తావన చెప్పబడుతుంది. తెలుగునాట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వేయి పడగల ఆరాధ్య దైవంగా, పూజలందు కొంటున్న ప్రస్తావన ఆధారంగా చాతుర్వర్ణ ధర్మాలు, దాంపత్య ధర్మం, చివరకు ఏక జాతి వేద ధర్మం, సాక్షాత్కరిస్తుంది. సహస్ర ముఖమైన ధర్మం వర్ధిల్లుతుంది. ఈ నవలలో పాత్రలన్నీ ఒక్కొక్క ధర్మానికి సంకేతంగా కథ నడుస్తుంది. నేటి పాలకులు, ధనికులు సంప్రదాయాన్ని, దేశీయ పాండిత్య, ఆధ్యాత్మిక వారసత్వ విలువలను ఏ విధంగా నీరు గారుస్తున్నారో ఆ విధంగా నిరాదరణకు గురి అయిన ప్రస్తుత ఆధునిక సమాజం ఎలా నిర్వీర్యం అవుతుందో, జాతి సంస్కారహీన, దైన్యత్వాన్ని ఈ నవల వ్యక్తీకరిస్తుంది. హిందూ ధర్మం అనాదిగా సర్వ జగత్తు సంక్షేమం కోసం సంప్రతిష్టింపబడిన మహోన్నత ధర్మంగా విశ్వనాథ ఈ నవలలో అంతరార్థంగా సంభావింపచేస్తారు. నవనాగరిక పాశ్చాత్య భావజాలం, సమాజాన్ని, దేశాన్ని, కుటుంబాన్ని, జీవితాలను శాసించి పాలిస్తున్న 21వ శతాబ్దంలో, వేయి పడగల సనాతన భావజాలం కొంత విమర్శలకు గురి అయింది. భారతీయ సంస్కృతి, వేద ధర్మాలు ఏ విధంగా దుర్వ్యాఖ్యానం చేయబడుతున్నాయో నిరూపించడానికి రాయబడిన ఈ నవల నిస్సందేహంగా కాల ప్రవాహానికి ఎదురు ఈదినట్టుగా భావించే ఆధునిక ప్రగతిశీల వాదం, విశ్వనాథ సాహిత్యాన్ని తూర్పారబట్టినా 'వేయి పడగలు' శాశ్వతమైన అపూర్వ నవలగా స్మరణీయత పొందుతోంది.

సుబ్బన్నపేట వంటి తెలుగు గ్రామాలు నేడు లేవు. రామేశ్వర శాస్త్రి, ధర్మారావు, అరుంధతి, కృష్ణమనాయడు, రుక్మిణమ్మారావు, కేశవరావు, గోపన్న, పసిరిక, గణాచారి దేవదాసి వేయి పడగలు నవలలో ప్రతీ పాత్ర కథను నడిపించిన తీరుతెన్నులు, అటువంటి నవల నభూతో నభవిష్యతి.

వేయి పడగల పాము, నాల్గు శిరసుల నాగు, రెండు శిరసుల నాగు, ఒక శిరసు నాగన్న ప్రతీకలుగా కవి సమ్రాట్ విశ్వనాథ సృష్టించిన వేయి పడగలు నేటికీ విశ్వనాథ సాహితీ సామ్రాజ్యంలో, తెలుగు నవలగా మకుటాయమానంగా విరాజిల్లుతోంది.

**"నీవాక పెద్ద వెల్గువయి నీ వెలుగారిన నాదు జీవిత**
**వ్యావృతి యీ కవిత్వమనునట్టి విచిత్రపు నీడ పారెనో**
**దేవి! అరుంధతీ ప్రముఖ దివ్యమహః పరిలీనమూర్తి! ఆ**
**నీ వెలుగుల్ పరోక్షమయి నేటికి నీడలు పాఱజొచ్చెడున్"**

అన్నారు ఈ మహా నవలా ప్రారంభంలో అంకితం పద్యంగా కవి సమ్రాట్ విశ్వనాథ. ✦

# నిజమైన భక్తులు

పులివర్తి కృష్ణమూర్తి

భారతదేశం ప్రాచీన కాలం నుండీ ఆధ్యాత్మిక తత్వం చేతనే ప్రసిద్ధి గాంచింది. అసలు భారతీయుడు అంటే ఎవరు? అని ప్రశ్నించుకుంటే కేవలం భారతదేశంలో పుట్టినవాడా? కాదు కాదు.. సర్వ ధర్మాలను పాటించేవారే భారతీయులు.

మన సంస్కృతి ఎంతో విలువైనది, గంభీరమైనది, మధురమైనది. ఇలాంటి గొప్ప సంస్కృతిని ఇప్పుడు కొందరు గాలికి వదిలిపెట్టారు. అందువల్లనే వారంతా సర్వ సంపదలూ, సౌఖ్యాలూ ఉన్నప్పటికీ శాంతిని పొందలేకున్నారు.

కొందరు భగవంతుని ధన, కనక, వస్తు, వాహనాదులను కోరుకుంటారు. కానీ అంతకుమించి కావల్సిన శాంతిని కోరుకోరు. శాంతి లేనివానికి ఎన్ని వున్నా ఏమిటి ప్రయోజనం?

రావణునికిగానీ, హిరణ్యకశిపునికిగానీ, దుర్యోధనునికిగానీ సిరిసంపదలకు ఏమాత్రం లోటు లేదు. కానీ దుర్గుణాల చేత శాంతిని కోల్పోయారు. మనిషి తనలో వున్న శక్తులను తాను గుర్తుంచుకోవడంలేదు. మనం గాయత్రీ మంత్రాన్ని ఉచ్ఛరిస్తున్నాం. గాయంత్రీ మంత్రమునందు 'భూర్భువస్సువః' అని అంటాం.

ఈ దేహమే భూలోకం. మనస్సే భువర్లోకం. ఆత్మయే సువర్లోకం. ఈ మూడు లోకాలు కూడా మనలోనే వున్నాయి. అన్ని శక్తులూ మనలోనే ఉన్నప్పటికీ, శక్తిహీనులుగా జీవిస్తూ వున్నా. మానవుడే మహనీయుడు. తాను తల్చుకుంటే సాధించలేనిది ఏదీ వుండదు. లక్షల మైళ్ల అంతరిక్షయానం చేస్తున్నారు. కానీ కొంచమైనా తన హృదయాంతరాళంలోకి తొంగిచూసుకోవడం లేదు. శాంతి అనేది మనలోనే వుంది. బయట లేదు. బాహ్యంలో అంతా అశాంతి.

పూజలూ, వ్రతాలూ, నోములూ ఎంత కాలం చేసినా మనస్సులో శాంతి చోటు చేసుకోవడం లేదు. ఎందువలనంటే ఏది చేసినా, మనస్సును నియంత్రించడంలో విఫలమవడమే కారణంగా చెప్పుకోవాల్సి వుంది. మనం పూజా రూములో వుంటే మన మనస్సు ఎక్కడో పరిభ్రమిస్తూ వుంది. ఇక అంతర్దృష్టి ఎలా లభ్యమవుతుంది. ఏకాగ్రతే లోపించినప్పుడు శాంతి లభించే అవకాశమే లేదు.

ప్రతి మనిషీ కేవలం తన కడుపు గురించే ఆలోచిస్తూ వున్నాడు. రామాయణంలో కబంధుడి కథ విన్నాం కదా!

కబంధుడికి కడుపు పైనే తల వుండేది. అంటే అతడు ఎప్పుడూ తన కడుపు గురించే ఆలోచించేవాడు. కడుపు ప్రధానం కారాదు. చింత అంతా హృదయం మీద వుంచాలి. సత్యాన్ని గుర్తించి ప్రవర్తించాల్సి వుంది. ఎక్కడ చూసినా స్వార్థ ప్రయోజనాలే ముఖ్యంగా భావించడం గమనిస్తూ వున్నాం.

అలాగాక మానవుడు నిస్వార్థమైన సేవకు ఉపక్రమించాలి. ఆ సేవను ప్రేమపూర్వకంగా చెయ్యాలి. ప్రతి మనిషీ తన హృదయాన్ని పవిత్రమైనదిగా తీర్చిదిద్దుకోవాలి. మాటల్లో సత్యం దాగుండాలి. చేతలు పరోపకార సంబంధమైనవిగా ఉండాలి. దీన్నే త్రికరణ శుద్ధి అని అంటారు.

అన్నంత మాత్రాన కొందరు వారిలో చెడు ప్రవేశించకూడదని ఆశించి, ఎల్లప్పుడూ దానినే స్మరిస్తూ కూర్చుంటున్నారు. దానివలన ఆ చెడుకు మరింత బలం చేకూరుతోంది. దేన్ని మనం వద్దనుకున్నామో దాన్ని గురించే స్మరిస్తూ వున్నాం.

అలాగాక మీరు దేనిని ఆశిస్తున్నారో ఏది ప్రేమిస్తున్నారో దాని గురించే సదా స్మరించాలి. మనస్సులో కోరుకుంటూ వుండాలి. నిరంతరం దైవ చింతన చేస్తుంటే నీ అదృష్టం వలన భగవంతుడి అనుభూతి మీకు కలగవచ్చు. భగవంతుడు ఎంతో పవిత్రుడు. భగవంతుడిని అంతటి పవిత్ర భావంతోనే స్మరించాలి. పరిపూర్ణుడైన భగవాన్ కృపను పొందాలంటే నీలోనూ పరిపూర్ణంగా విశ్వాసం వుండాలి. ఎన్నో జన్మల తర్వాత, అంటే పశుత్వం నుండి మానవత్వం లభించింది.

హృదయంలో ఎల్లప్పుడూ పవిత్ర భావాలే వుండాలి. చేతనైనంత వరకు ఇతరులకు సహాయం చేయి. ఒక విధంగా మీరు ఆలోచిస్తే, అదే తపం, అదే జపం, అదే సర్వస్వం. పరోపకార సంబంధమైన పనులలో పాల్గొనకుండా హృదయంలో పవిత్ర భావాలు లేకుండా ఊరికే 'రామ్', 'రామ్' అంటూ జపమాల తిప్పితే కాలాన్ని వృథా చేసుకున్నవారం అవుతాం. చాలా మంది తాము రామభక్తులం అనుకుంటారు. అలాంటివారు ముందు రాముని ఆదర్శాలను అనుసరించాల్సి వుంది. అప్పుడే వారు నిజమైన రామభక్తులు అనిపించుకుంటారు.



అలాంటి భగవత్ప్రేరణతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుంది.

# కృత్రిమ క్రిమికీటకాలు


యామిజాల జగదీశ్

**అనగనగా ఒక చిన్న చీమ.**

**అది ఎవరితోనూ మాట్లాడకుండా ఓ చోట కూర్చుంది.**

**ఎవరైనా తనను దాటుకుంటూ పోతున్నప్పుడు అది ఒక్కసారిగా వారిపై దాడి చేస్తుంది. తరుముతుంది. ఇది ఎలా సాధ్యం?**

**విషయం ఏమిటంటే.. అది నిజమైన చీమ కాదు. కృత్రిమ చీమ. అది ఒక రోబో చీమ.**



అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.

అక్కడ ఉన్న పరిశోధన శాలలో ఇటువంటి కృత్రిమ క్రిమికీటకాలను సృష్టిస్తున్నారు.

వారు తయారుచేసే కృత్రిమ చీమకు జెనిక్స్ అని పేరు.

ఈ రోబో చీమ కృత్రిమమే అయినప్పటికీ చూడ్డానికి అచ్చం నిజమైన చీమలాగానే ఉంటుంది. చాలా సహజంగా ఉంటుంది. నిజమైన చీమ కదలిక ఎలా ఉంటుందో అచ్చం అలానే ఉంటుంది. ఈ రోబో చీమ కదలిక. నడుస్తుంది, వెనక్కు వస్తుంది, ముందుకు పోతుంది. ముందు పోతున్న వారిపై దాడి చేస్తుంది. దాని తీరు ఎక్కడా రోబో చీమ అనిపించదు. జీవమున్న చీమలా అనిపిస్తుంది. నిజమైన చీమ లాగానే ప్రవర్తిస్తుంది.

ఈ చీమ మాత్రమే కాదు, ఎన్నో రకాల పురుగులను అక్కడ ఉన్న శాస్త్రవేత్తలు సృష్టిస్తుంటారు.

ఎందుకోసం..

ఇంటిపనులు చేయడం కోసం, ఆపరేషన్లు చేయడం కోసం, కుజగ్రహానికి వెళ్లి పరిశోధనలు చేయడానికి.

ఇలా అనేకానేక పనులు చేయడం కోసం క్రిమికీటకాలను ఇక్కడి ప్రయోగ శాలలో తయారు చేస్తుంటారు.

ఇక్కడి శాస్త్రవేత్తల ముఖ్యమైన ఉద్దేశం ఏమిటో తెలుసా...

ఓ కృత్రిమ ప్రాణాన్ని ఇనుప శరీరానికి ఇవ్వడం. అలా సృష్టించిన వాటిని ప్రపంచం మీదకు విడిచిపెట్టడం. వాటి ద్వారా కీలకమైన పనులు చేయించడం.. అది వారి లక్ష్యమంతా.

మొదట వారు సృష్టించినదాని పేరు ఆలన్. అది ఓ చీపురు. వాక్యూమ్ క్లీనర్.

ఇది కీ ఇచ్చిన బొమ్మలాగా గోడలో ఉన్న రంధ్రాలను శుభ్రం చేస్తుంది. తలుపు దగ్గరకు వెళ్తుంది. అక్కడ ఉన్న దుమ్మును ధూళిని శుభ్రం చేస్తుంది.

ఆ పరిశోధన శాలలో తయారైన రెండవ రోబో హెర్బెర్ట్. దీని పని ఏమిటో తెలుసా?

ఆ పరిశోధన శాలలో అక్కడక్కడా ఉన్న ఖాళీ సోడా బాటిళ్లను సేకరించడం.

ఇలా యంత్ర క్రిమికీటకాలను పంపి చంద్రుడిలోనూ, కుజగ్రహంలోనూ పరిశోధనలు చేయించాలన్నది వారి ఉద్దేశం.

అందుకోసమే వీరు ఏం చేస్తారంటే– ఈ యంత్ర పురుగుల ప్రతి భాగాన్ని ఎంతో జాగ్రత్తగా తయారు చేస్తారు. అనంతరం వాటితో తామనుకున్న పనులు చేయించుకుంటారు.

జెనిక్స్ అనే చీమను కూడా ఈ కోవలో తయారు చేసిందే.

అటిలా అనే శక్తిమంతమైన రోబోని కూడా ఈ పరిశోధన కేంద్రం తయారు చేసింది. దానితో అంతరిక్షంలో పరిశోధనలు చేయాలన్నది వారి లక్ష్యం.

రోబోలతో తమకు కావలసిన పనులు చేయించడమే తమ ప్రధాన లక్ష్యమని శాస్త్రవేత్తలు చెప్పారు.

అదలా ఉంటే– మన చీమల గురించి ఓ కథ ఉంది.

అదేమిటంటే–


ఓ భారీ ఏనుగు భయంతో కిందా మీదా పడి పరుగెడుతోంది.

ఆ దారిలో ఓ చిన్న చీమ నిల్చుని ఉంది. అది ఆ ఏనుగును చూసి ఎందుకు ఇలా భయపడి పరిగెడుతున్నావు? ఏమైంది? ఎవరు నిన్ను భయపెట్టారు? ఎవరు తరుముతున్నారు? అని నింపాదిగా అడిగింది చీమ.

చీమ మాటలన్నీ విన్న ఏనుగు "ఓ పిల్లి నన్ను తరుముకొస్తోంది. అందుకే భయపడి చస్తున్నా!" అని.

అప్పుడు చీమ ఇలా చెప్పింది...

"ఏమిటీ? పిల్లిని చూసి నువ్వు భయపడుతున్నావా? ఇక ఏమాత్రం భయపడకు.. మరో మాట మాట్లడకుండా నా వెంబడి రా. లేకుంటే నా వెనుక దాక్కో అని.



# అద్భుత నిర్మాణాలు

షేక్ అబ్దుల్ వాకీం జాని



## అల్హంబ్రా

దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ముస్లింలు, క్రైస్తవులు, జాయిష్‌లో గ్రెనడా రాజ్యంలో సోదర భావంతో జీవించారు. గ్రెనడా నగరానికి అభిముఖంగా చేరువలో సియర్రా పర్వత సానువుల్లో సబికా కొండపై మూర్ పాలకుల చివరి కలగా అల్హంబ్రా పేరుతో పటిష్టమైన కోట నేటికీ నెలకొని ఉంది. ఇస్లామిక్ నిర్మాణ శైలిలో నిర్మించిన అత్యంత ప్రసిద్ధ స్మారక నిర్మాణం. స్పానిష్ పునరుజ్జీవనోద్యమానికి సంబంధించిన ముఖ్యమైన చారిత్రక విశేషాలను కలిగివుండి, ఇస్లామిక్ ప్రపంచంలో అద్భుతమైన కోటగా ప్రశంసలు అందుకుంటోంది. స్పెయిన్‌లోని ప్రధాన ఆకర్షణలలో ఇది ఒకటి.

1984 నుండి ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేరి యునెస్కోవారి గుర్తింపు పొందింది. మన దేశంలోని తాజ్‌మహల్‌ను కులమతాతలకతీతంగా అందరూ ఎలా ఇష్టపడతారో అదే విధంగా అల్హంబ్రా సాంస్కృతిక భవంతిని ప్రపంచ ప్రజలు ఇష్టపడతారు. ఈ నిర్మాణ సముదాయాన్ని 11వ శతాబ్దం నుండి ఎందరో తీర్చిదిద్దారు. మహమ్మద్ ఇబ్న్ అల్-అహ్మార్, ఇబ్న్ నగ్రిల్లా, నస్రిద్ రాజవంశ పాలకులు, 14వ శతాబ్ది పాలకులైన యూసుఫ్, మహమ్మద్ ఇత్యాది వారెందరో పలు మార్పులు చేసి ఈ సాంస్కృతిక భవంతిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

ఈ ప్రాంతంలో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఆరు ఆకర్షణీయమైన అద్భుతలు కోటలు ఉన్నాయి. ఎక్కువ భాగం కోటలు అల్హంబ్రాకు ఉత్తర అంచున ఉన్నాయి. ఇవన్నీ ఒకప్పటి మూరిష్ తెగకు చెందిన నాస్రిడ్ రాజుల నివాస భవంతులుగా ఉండేవి.

అల్హంబ్రా రాజ నగరంగా భాసిల్లింది. మెక్సు వార్, కోమరేస్ ప్యాలెస్, ప్యాలెస్ ఆఫ్ ది లయన్స్, పార్టల్ ప్యాలెస్ ఇవి నేడు సందర్శకులకు ప్రధాన ఆకర్షణగా నిలిచి ఉన్నాయి. అల్కాజాబా కోట అల్హంబ్రాకు పశ్చిమ కొన వద్ద ఉంది. ఆ కాలంలో ఇది రక్షణ వ్యవస్థకు కేంద్ర బిందువుగా ఉండేది. కొన్ని శతాబ్దాలుగా అభివృద్ధి చెందిన మూరిష్ నిర్మాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ ఇవి నిలిచి ఉన్నాయి.

భవనం లోపలి భాగంలో అద్భుతమైన అలంకరణలు కనిపిస్తాయి. ప్రధానంగా దిగువ గోడలపై టైల్ మొజాయిక్‌లతో రూపొందించగా, గోడల పై భాగంలో చెక్కతో చిత్రిక పట్టిన కళారూపాలు, అరబిక్ కాలిగ్రఫీ అలంకారాలు ప్రధాన ఆకర్షణగా కనిపిస్తాయి. ముఖార్నాస్ అని పిలిచే 'స్టాలాక్టైట్' లాంటి శిల్పకణతో అదనపు ఆకర్షణగా తీర్చిదిద్దారు.

అల్హంబ్రాలోని కోటల నిర్మాణం ప్రకృతి సమతుల్యత పాటిస్తూ చేసినట్లు కనిపిస్తుంది. ప్రతి గదిలోనూ చల్లదనంతో కూడిన కాంతి ప్రసరించడం విశేషం. మూరిష్ పాలకులకు ఉద్యానవనాలంటే చాలా ఇష్టపడేవారు. ఆ కారణంగా ఇక్కడ అందరినీ ఆకర్షించే విధంగా అద్భుతమైన ఉద్యానవనాలను నిర్మించారు. మెక్సుర్ అనే భవనాన్ని పాలనా యంత్రాంగం కోసం ఉపయోగించేవారు. కొంత కాలం ఈ భవనం విదేశీ రాయబారుల కోసం కూడా ఉపయోగించారు.

ఈ కళాఖండాల మధ్యలో 1526లో అయిదవ చార్లెస్ ఒక కొత్త కోటను నిర్మించాడు. దీన్ని నేడు ప్యాలెస్ ఆఫ్ చార్లెస్ అని పిలుస్తున్నారు. ఇది నస్రిద్ రాజవంశ పాలకుల ప్యాలెస్‌లతో నేరుగా అనుసంధానం చేయబడింది. అయితే ఇది అసంపూర్తిగా మిగిలింది. అల్హంబ్రా ఆధునిక శాస్త్రీయ అధ్యయనానికి సంబంధించిన తొలి ఇస్లామిక్ స్మారక కట్టడాలలో ఒకటిగా నిలిచి వుంది.


## మాడ్రిడ్‌లో అద్భుత నిర్మాణాలు

యూరోపియన్ యూనియన్‌లో రెండవ అతిపెద్ద నగరం మాడ్రిడ్. ఇది స్పెయిన్ దేశ రాజధాని నగరం. రెండవ ఫిలిప్ 1563 మంది 1584 మధ్య కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించాడు. ఫ్రెంచివారు దీన్ని జయించిన సందర్భంగా రెండవ ఫిలిప్ ఒక అద్భుత భవంతిని నిర్మించాడు. దీని పేరు ఎల్ ఎస్కోరియల్. ఇది ప్రపంచంలోని అద్భుతాలలో ఒకటి. అతిపెద్ద పునరుజ్జీవనోద్యమ భవనంగా, స్మారక చిహ్నంగా ప్రసిద్ధి చెందింది.

ఇది స్పానిష్ రాజకుటుంబీకులకు చెందిన ప్రదేశాలలో ఒకటి. ఇక్కడ అతి పెద్ద మఠం, ప్రార్థనాలయాలు, బాసిలికా, రాజభవనం, రాజవంశీయుల గ్రంథాలయం, మ్యూజియం, పాఠశాల, విశ్వవిద్యాలయం, ఆసుపత్రి ఇత్యాదివి కలగలిపి నిర్మించారు. రాయల్ ప్యాలెస్ స్పెయిన్ రాజ కుటుంబీకుల అధికార నివాసం అయినప్పటికీ, ఇక్కడ పలు నిర్మాణాలు చేసినప్పటికీ ప్రధాన భవనంలో ఎక్కువ కాలం నివసించిన ఏకైక చక్రవర్తి రెండవ ఫిలిప్.

ఇతను హైరోనిమైట్ సన్యాసుల సంఘంతో స్థాపించిన ఆశ్రమం కూడా ఉంది. ఇక్కడి గ్రంథాలయంలో నాలుగు వేలకు పైగా చేతిరాతతో లిఖించిన గ్రంథాలు, 40 వేలకు పైగా అద్భుత, అరుదైన గ్రంథాలు ఉండేవి. ఒక సందర్భంలో జరిగిన అగ్ని ప్రమాదంలో అనేక గ్రంథాలు కాలి బూడిదయ్యాయి.

దాదాపు 16 అంతర్మందిరాలతో 80కి పైగా నీళ్ల విరజిమ్మే ఫౌంటెన్లు, సుందరమైన మెట్ల మార్గాలు, 2,600 కిటికీలు, 16 ప్రాంగణాలు, 1200 తలుపులతో అద్భుతంగా ఈ జ్ఞాపక చిహ్నాన్ని నిర్మించారు. ఈ భవంతి నిర్మాణం కోసం రెండవ ఫిలిప్ అనేక మంది భూగర్భ శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని మాడ్రిడ్‌లో సియర్రాడి గాడెర్రమా వద్ద ఈ అద్భుత భవనరాజాన్ని నిర్మించాడు. రెండవ ఫిలిప్ స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ భవనాన్ని నిర్మాణాన్ని చేయించాడు. ఈ భవనం నిర్మించడానికి దాదాపు 21 సంవత్సరాల కాలం పట్టింది. 1984 నవంబరు 2న ఈ కోటను యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు. ఇక్కడి కోటను 1563 ఏప్రిల్ 23న జువాన్ బటిస్టా డి టోలెడో పర్యవేక్షణలో ప్రారంభించారు. ఆ కోటను రూపొందించిన తొలి వాస్తు శిల్పి ఇతనే. 1567లో టోలెడో మరణంతో అతని శిష్యుడైన జువాన్ డి హెర్రెరా



ఆధ్వర్యంలో 1584లో పూర్తి చేశారు. రెండవ ఫిలిప్ తన తండ్రి అయిన రోమన్ చక్రవర్తి ఐదవ చార్లెస్ జ్ఞాపకార్థం ఈ ప్రదేశంలో సమాధిని రూపొందించాలని భావించాడు. అటువంటి జ్ఞాపక చిహ్నాల సమాహారంతో పాటు ప్రార్థనా మందిరాలు కూడా నిర్మించాడు. స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్ తన 71వ ఏట ఎల్ ఎస్కోరియల్ కోటలోనే పరమపదించాడు. అతనిని కూడా ఇక్కడ స్పెయిన్ రాజులను ఖననం చేసిన పాంథియోన్ అనే ప్రదేశంలోనే సమాధి చేశారు. ఇక్కడే రాజ కుటుంబీకుల సమాధులు ఉన్నాయి.

ఇంకా 1631లో స్థాపించిన రాయల్ థియేటర్, 1712లో స్థాపించి 19వ శతాబ్దంలో పునరుద్ధరించిన జాతీయ గ్రంథాలయ భవనం, 1850లో పునరుద్ధరించిన ఒపేరా హౌస్, ప్లాజా మేయర్, మాడ్రిడ్ రాయల్ ప్యాలెస్, బ్యూన్ రెటిరో పార్క్, స్పెయిన్ జాతీయ మ్యూజియం, ప్రాడో మ్యూజియం, రీనా సోఫియా మ్యూజియం, ఆధునిక కళలతో విరాజిల్లుతున్న థిస్సెన్-బోర్నెమిస్జా మ్యూజియంలు, సిబిలెస్ ప్యాలెస్ ఇత్యాదివి ప్రత్యేక ఆకర్షణలు. మాడ్రిడ్‌లో ప్రపంచ పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయం ఉంది. ఈ నగరంలో ఫ్యాషన్ వీక్ వంటి ఉత్సవాలు జరుగుతాయి. విద్యా, వినోదం, పర్యావరణం, మీడియా, ఫ్యాషన్, సైన్స్, సంస్కృతి, కళలు మొదలైన గొప్పతనాలు కలిగివున్న మాడ్రిడ్ నగరం ప్రపంచ ప్రధాన నగరాలలో ఒకటిగా విరాజిల్లుతోంది.



## విభిన్న రుచుల్లో పానీపూరీ

పానీపూరీలు ఎన్ని తిన్నా మరొక్కటి తినాలని అనిపిస్తుంది. పానీపూరీ నీళ్ల ఒకప్పుడు ఒకటే రుచిలో లభించేవి. అయితే ఇప్పుడు నాలుగైదు రకాల రుచులు పొడుల రూపంలో లభిస్తున్నాయి.

ఒక కిట్ మాదిరిగా ఈ ప్యాక్‌లో వేయించని పూరీలతో పాటు నాలుగైదు రుచుల్లో మసాలా పొడులు ఉంటాయి. వీటితో పాటు కట్టామీఠా, పుదీనా, హింగ్, వెల్లుల్లి లాంటి చట్నీలు సైతం ఉంటాయి. ఈ పొడులను నీళ్లల్లో కలిపితే నచ్చిన ఫ్లేవర్ నీటితో ఎంచక్కా పానీపూరీలు కావలసినన్ని తినొచ్చన్నమాట. బొజ్జ నిండుగా తిన్నా చాట్ బండి దగ్గర ఏక్ స్వీట్ అని అడినట్లుగా ఇంట్లోనూ కాసింత మీఠా చట్నీని వేసుకుని చివరి పూరీని కూడా తినొచ్చండోయ్!





## కోరుకున్న పాప్‌కార్న్ ఇంట్లోనే!

పాప్‌కార్న్ కిట్‌తో పాటు సీజనింగ్ పొడులన్నీ విడిగా లభిస్తున్నాయి మార్కెట్లో. పాప్‌కార్న్ కిట్‌లో మొక్కజొన్న గింజలతో పాటు, పెరిపెరి, బటర్‌సాల్ట్, పాప్‌డీ చాట్, హాట్ అండ్ స్వీట్ అంటూ వివిధ రకాల మసాలాలు వస్తాయి. వీటితో నచ్చిన రుచుల్లో పాప్‌కార్న్ తయారు చేసుకోవచ్చు. ఈ పొడులు విడిగానూ దొరుకుతాయి కనుక పాప్‌కార్న్‌తో పాటు ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్‌ను ఈ పొడులతో సహా ఆరగించొచ్చు.

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కార్యాలయంలో సహోద్యోగులతో స్నేహంతో మెలగుతారు. ఎవరు ఏ సహాయం అడిగినా కాదనకుండా చేస్తారు. మిత్రులతో సంభాషణలు సాగిస్తారు. విందు, వినోదాల్లో పాల్గొంటారు. కుటుంబ సభ్యులతో కలిసి దూర ప్రాంత ప్రయాణాలకు కావలసిన తేదీలను ఖరారు చేస్తారు.

## వృషభం



బ్యాంకింగ్ వ్యవహారాల పైన దృష్టి సారిస్తారు. ఆదాయ, వ్యయాలు; కొనుగోలు, అమ్మకాల పైనే ఆలోచనలు సాగుతాయి. ఆర్థిక వనరులు సమృద్ధిగా వున్నప్పటికీ ఆత్మసంతృప్తి ఉండదు. అందుకు ప్రత్యేక కారణాలేమీ ఉండవు. వృత్తి, ఉద్యోగాలపరంగా అధికంగా శ్రమిస్తారు. సానుకూల ఫలితాలు సాధిస్తారు. జీవిత భాగస్వామి సలహాలు పాటిస్తారు.

## మిథునం



ఉద్యోగులు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారంలో నూతన మార్పులు చేస్తారు. వృత్తి పరంగా చెప్పుకోదగిన మార్పులేవీ ఉండవు. ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోకండి. మీ ప్రమేయం లేకుండా మిమ్మల్ని వివాదాల్లోకి లాగే సూచనలున్నాయి. సామాజిక పరమైన అంశాలు మిమ్మల్ని ఆలోచింపచేస్తాయి.

## కర్కాటం



మీ శక్తి యుక్తులను ప్రదర్శించి ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గతంలో వాయిదా పడ్డ శుభ కార్య సంబంధిత వ్యవహారాలను తిరిగి సమీక్షిస్తారు. వృత్తిలో తోటి వారితో అభిప్రాయ భేదాలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించండి. క్రయ-విక్రయాలు కష్టసాధ్యమవుతాయి. అయినప్పటికీ ఆర్థిక సర్దుబాట్లను నేర్పుగా చేసుకుంటారు.

## సింహం



ఆర్థికంగా ఒడుదుడుకులుంటాయి. ఆలోచనలను ఎంతో కొంత కార్య రూపంలోకి తీసుకు వస్తారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆహార, ఆరోగ్య నియమాలను ఏమాత్రం అశ్రద్ధ చేయకండి. కొన్ని సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయి. పలు రంగాలలోని అంశాలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి.

## కన్య



లౌక్యంగా వ్యవహరిస్తారు. ముఖ్యమైన చర్చలు జరిపేటప్పుడు అప్రమత్తంగా మెలగడం మంచిది. ఆర్థిక వ్యవహారాలు ఊహించినదానికన్నా సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి, ఉద్యోగాల్లో మంచి పేరు సంపాదిస్తారు. కొత్త కొత్త ఆలోచ నలు చేస్తారు, వాటిని కొంతవరకు అమలు పరుస్తారు. వ్యాపారంలో మీరు అవలంభించిన వ్యూహాలు మంచి ఫలితాలనిస్తాయి.

## తుల



స్వల్పకాలిక పరిస్థితుల వల్ల అపరిమితమైన అనుకూల ఫలితాలు సాధిస్తారు. శుభ కార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. అదనపు ఆదాయ మార్గాలు కలిసి వస్తాయి. విద్యారంగంలో వున్నవా రికి మంచి అవకాశాలు సంప్రాప్తిస్తాయి. ఉద్యోగంలో మీ స్థాయిని, పరపతిని పెంచే విధంగా మార్పులు చోటు చేసుకుంటాయి. మీలోని భావాలు ఇతరులకు తెలియనివ్వరు. కొంత మంది వ్యక్తులతో కలవడం ఇష్టంలేక కొన్ని ప్రయోజనాలు వదులుకుంటారు.

## వృశ్చికం



ఆర్థిక వ్యవహారాల పైన దృష్టి సారిస్తారు. ప్రశాంత చిత్తంతో ఎదుటివారు చెప్పేది ఆసాంతం విని బాగా ఆలోచించి తీసుకుంటారు. తద్వారా లాభపడతారు. కార్యాలయంలో అనుకూల వాతావరణం వుండడం వల్ల లాభపడతారు. వ్యాపార విస్తరణకు సంబంధించి కొత్త ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసే విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారు. నిర్మాణాత్మక విషయాలలో నాణ్యతను పరిశీలిస్తారు.

## ధనుస్సు



వృత్తి, ఉద్యోగాల్లో చెప్పుకోదగిన రీతిలో శ్రమిస్తారు. సానుకూల ఫలితాలు సాధిస్తారు. పని వత్తిడి వల్ల విధి లేని పరిస్థితుల్లో కుటుంబ వ్యవహారాలు నిర్లక్ష్యం చేస్తారు. చర్చగోష్టులలో ఉపకరించే కొన్ని కొత్త అంశాలు తెలుసుకుంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి. మీ కష్టాన్ని కుటుంబ సభ్యులు అర్థం చేసుకుని, సహకరిస్తారు. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కళా రంగాలలో పాల్గొంటారు. విలువైన వస్తువులు కొనుగోలు.

## మకరం



అడ్వాన్స్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఓ ఆస్తివల్ల పరోక్షంగా లాభపడతారు. మీ గుడ్ విల్ పెరుగుతుంది. ప్రయాణాలు లాభిస్తాయి. పంతాలు, పట్టింపులకు దూరంగా వుంటే మంచిది, లేదంటే ప్రయోజనాలు దెబ్బ తినే అవకాశం ఉంది. గోప్యంగా కొన్ని పనులు చేపట్టి వాటిని వృద్ధిలోకి తీసుకువస్తారు. క్రీడాకారులకు అనుకూలం. విలువైన నూతన వస్తువులు కొనుగోలు. పరిస్థితుల ప్రభావం వలన పొదుపు పైన దృష్టి సారించలేరు.

## కుంభం



గ్రహస్థితి అనుకూలంగా ఉంటుంది. వ్యాపారంలో రొటేషన్ బాగుంటుంది. మీ నైపుణ్యానికి, సామర్థ్యానికి తగిన గుర్తింపు లభిస్తుంది. ప్రజా సంబంధాలను మెరుగు పరుచుకుంటారు. ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. ముఖ్యమైన కార్యక్రమాలకు తేదీలు ఖరారు చేసుకుంటారు. గృహావసర ఖర్చులు మితిమీరి ఉంటాయి.

## మీనం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. విద్యా సంబంధమైన విషయాల్లో అనుకూలమైన ఫలితాలు సాధిస్తారు. మీ శక్తి సామర్థ్యాలను నిరూపించుకునే అవకాశాలు కలిసి వస్తాయి. ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడుదుడుకులేవీ ఉండవు. ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల ఆకర్షితులవుతారు. రాజకీయ పరంగా తీసుకునే నిర్ణయాలు కొన్ని లాభిస్తాయి. ప్రతి విషయంలోనూ స్వలాభం లేకుండా తల దూర్చరు.

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**
**సెల్స్: 9885446501/9885449458**

# ఖర్చులను నియంత్రించడం ఎలా?

**సి.ఫణికుమారి – వేములవాడ**

**ప్రశ్న: ఇంటిప్లాను పరిశీలించి ఏవైనా లోపాలుంటే తెలుపగలరు. ఈ ఇంట్లోకి మారిన తరువాత నా భార్య మరణించింది. అది దైవికంగా సంభవించిందని అనుకున్నాను. కానీ ఎంత ఆదాయం వస్తున్నా అంతకు మించి ఖర్చులు వస్తున్నాయి.**

**జవాబు:** ఆమె పోవడానికి ఇంట్లో గల వాస్తులోపం కారణం కాదు. నుయ్యి ఇంటి గదుల లోపలికి ఉత్తర వైపు నుండి చొచ్చుకుపోయింది. అలా వుండకూడదు. నుయ్యిని ఉత్తర కాంపౌండు గోడకు దగ్గరగా తవ్వి ఇప్పుడున్న నుయ్యిని పూడ్చివేయాలి. ఉత్తర ఈశాన్యం పెరిగి వుంది.. మంచిదే. కానీ తూర్పు ఆగ్నేయం కూడా పెరిగి వుంది. దాన్ని సవరించడం శ్రేయస్కరం. మీ ఇంటికి వున్న అన్ని తలుపులూ నీచ స్థానంలో వున్నాయి. తలుపులను కిటికీల స్థానంలోకి;



కిటికీలను అలమారలను ప్రస్తుతం తలుపులున్న స్థానంలోకి మార్చడం వల్ల మీకున్న ఆర్థిక, యితరత్రా సమస్యలు చాలావరకు పరిష్కరించబడతాయి.

## ఏయే మార్పులు చేయాలి?

**ఎ.వసుంధర – కాకినాడ**

**ప్రశ్న: నేను పంపించిన ప్లానులో చేయవలసిన మార్పులు తెలుపగలరు.**

**జవాబు:** నైరుతిలో వున్న మెట్లు మొదట ఉత్తరానికి ఎక్కి ఆ తర్వాత దక్షిణానికి తిరిగాయి. అలా వుండకూడదు. మొదట దక్షిణానికి ఎక్కి తర్వాత ఉత్తరానికి తిరగాలి. బాత్‌రూమ్, టాయ్‌లెట్స్ ఇంటి స్వరూపంలో ఉత్తర వాయవ్యాన్ని పెంచుతున్నాయి. అలా కాకుండా ఇంటి స్వరూపాన్ని దీర్ఘ చతురస్రాకారంగా మార్చటానికి వాటిని తీసేయండి. అన్నిటికంటే ముఖ్యమైన విషయం మీ ఇంటికి దక్షిణ నైరుతి వీధిపోటు వుంది. ఇది మంచిది కాదు.

## ఇంట్లో మార్పులు చేయాలా?

**సి.కళ్యాణి – కాణిపాకం**

**ప్రశ్న: మీరు ఇస్తున్న సలహాలు చక్కగా వున్నాయి. మేం ఈ మధ్యనే కొనుక్కున్న ఇంటి ప్లాను పంపిస్తున్నాను. ఏమైనా మార్పులు చేయమంటారా?**

**జవాబు:** మీ ప్లానులో వున్నంతలో ముఖ్యమయిన మార్పులేమీ అవసరం లేదు. వరండాలో దక్షిణ ఆగ్నేయంగా తలుపు తెరిచి దానికి ఎదురుగా రోడ్డుపైకి వెళ్లటానికి గేటు తెరిస్తే సరిపోతుంది.

## పరిస్థితులు మారేదెలా?

**ఎన్.సాకేత్ – నూజివీడు**

**ప్రశ్న: మా ఇంటిప్లాను పంపిస్తున్నాను. మార్పులు సూచించగలరు. మా పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేని విధంగా వుంది.**

**జవాబు:** మీ ఇంటికి సెప్టిక్ ట్యాంక్ దక్షిణంలో వుంది. దాన్ని పూడ్చివేయడం మంచిది. తూర్పుగోడను ఆగ్నేయం మూల నుండి ఇరవై అడుగులు కొలిచి అక్కడ ఒక మార్క్ వేయండి. ఆ మార్కుని మధ్య బిందువుగా సెప్టిక్ ట్యాంక్‌ని తవ్వండి. లెట్రిన్ నుండి పైప్ లైన్‌ని ఆ సెప్టిక్ ట్యాంక్‌కి కలపండి. ఇంటికి తూర్పున వున్న తలుపు తూర్పు ఆగ్నేయంలో వుంది. దాన్ని అదే గదికి తూర్పు ఈశాన్యానికి మార్చి మరో తలుపును కూడా దానికి ఎదురుగా పశ్చిమ వాయవ్యంలోకి మార్చి రోడ్డుపైకి వెళ్లే గేటుని దానికెదురుగా మార్చండి. నైరుతి మూల దక్షిణ, పశ్చిమ గోడల నానుకొని ఐదడుగుల వెడల్పు, ఐదడుగుల పొడవు ఓ గదిని వేసి పైకప్పును ఉత్తర వాలుగా వేసి, ఉత్తరంలోనే తలుపు పెట్టి అందులో పనికిరాని వస్తువులు వేస్తూ వుండండి. ఈ మార్పులు చేయటానికి మీరు అనుకుంటున్నంత ఎక్కువ ఖర్చు వుండకపోవచ్చు. మీరూహించలేని విధంగా పరిస్థితులు, వ్యవహారాలు సానుకూలపడతాయి.

## సులభంగా అర్థమయ్యేలా..!


**బి.సోమనాథ్ – శ్రీకాళహస్తి**

**ప్రశ్న: వాస్తవ జీవితంలో వాస్తు పరిణామాలెలా వుంటాయి? వాస్తుకు ఒకే శాస్త్రం వున్నప్పుడు అనేకమంది తమ తమ అభిప్రాయాలుగా వాస్తు శాస్త్రాన్ని వక్రమార్గంగా నడిపించి ప్రజలను కష్టాలపాలు చేసి పలువురు సొమ్ము చేసుకోవడంలో అర్థం వుందా? ఏ ఒక్కరూ ఈ శాస్త్రాన్ని విశ్లేషణ జరిపి ప్రజలకు అందించలేకపోతున్నారు. మీరైనా ప్రజలకర్థమయ్యే విధంగా విశ్లేషించండి.**

**జవాబు:** ఒక వ్యక్తి నివసిస్తున్న గృహం వాస్తుకు అనుగుణంగా ఎలా వుంటే ఆ వ్యక్తి వాస్తవ జీవితంలో మంచి, చెడు పరిణామాలు అలాగే వుంటాయి. వాస్తు ఒకే శాస్త్రం అయినప్పుడు అనేకమంది అనే ప్రశ్న బావుంది. ఏ భాషలోనయినా అక్షరాలు వుంటాయి. ఆ అక్షరాలను ఎలా పొందుపరిస్తే భావాలు అలా పలుకుతుంటాయి. వాస్త శాస్త్రంలో కూడా వున్న సూత్రాలు అవే అయినా అక్కడున్న పరిసరాలను బట్టి వాస్తు శాస్త్రజ్ఞుడు ఆ సూత్రాలను అన్వయించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఒక్కో వాస్తు శాస్త్రజ్ఞుడు తన అనుభవం మీద ఆధారపడి సూత్రాలను అన్వయిస్తాడు. ఏ సూత్రాన్ని ఎప్పుడు, ఎక్కడ ఎలా అన్వయించాలో కచ్చితంగా ఆలోచించి నిర్ణయించడంలోనే వాస్తు శాస్త్రజ్ఞుడి ప్రతిభ కనిపిస్తుంది. ఆ ప్రతిభలో వున్న హెచ్చుతగ్గుల దృష్ట్యా ఒక్కొక్కరి అభిప్రాయంలో తేడా కనిపిస్తుంది. ప్రజలకు అర్థమయ్యేలా శాస్త్రాన్ని విశ్లేషించమన్న మీ సూచనలకు ధన్యవాదాలు. వాస్తుభూమి పుస్తకం చూస్తే మీకు సమాధానం లభిస్తుంది. ✦

# పదరంగం-26

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. కృతజ్ఞతలు (5)
3. ఆవు అరుపు (2)
7. విన్నపం (3)
9. రక్షణ (3)
12. నూనె తీసే యంత్రం (3)
13. పులుపు కోసం వాడేది తిరగబడింది (4)
15. జూదమాడే అడ్డసాళ్లు (ఏకవచనం) (3)
16. ఈ ఊరు టపాసుల తయారీకి ప్రసిద్ధి (4)
17. నమూనా, సామ్యం (3)
18. ఒకే రకం, తేడా లేదు (3)
19. భక్త రామదాసు అసలు పేరు (3)
20. అంతులేని అనుజ్ఞ, అంగీకారం (3)
22. వీణాది నాదం, న్యాయ స్థానాలలో తర్కబద్ధమైన భావ ప్రకటన (3)
24. హామీ, పూచీ (3)
25. గందరగోళం, అయోమయం లాంటిది (4)
26. ఒకప్పుడు సినిమాల చివర 'దీనిని' వేసి చూపించేవారు (2)

### నిలువు

1. బాగా మెరిస్తే ఇలా మెరిసిందంటారు (4)
2. పైకి లేచిన తెర (3)
4. నుయ్యి (2)
5. అల్లరి చేసే జంతువు (2)
8. కొంచెం అనారోగ్యం (3)
9...... గంధర్వులే తీర్చారని సామెత (5)
10. రూపాయిలో నాలుగో వంతు పైకొచ్చింది (4)
11. ఉత్సవం (3)
14. తల దువ్వుకోకపోతే ఇలా అంటారు (3)
16 కాశీ మరోలా పైకొచ్చింది (4)
17. సందేహం పటాపంచలైంది (4)
18. పూలచెండ్లలో వాడే సువాసనగల పూవు (4)
21. మదపుటేనుగు, ఒక తెలుగు పద్య వృత్తం (3)
23. ఆభరణం (2)

## పదరంగం-24 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ[1] | ప | వా[2] | దు | | తా[3] | | మో[4] | తా | దు[5] |
| ని | | దో | | ఆ[6] | ను | గ్ర[7] | హం | | ర్యో |
| శ్చ[8] | మం | ప | | తి | | హ | | బా[9] | ధ |
| తి | | వా[10] | తా | వ | ర[11] | ణం | | | ను |
| | | దా | | | మా | | భీ[12] | ము | డు |
| మ[13] | క | లు | అ[14] | రి | ర | | క | | |
| స | | | ద్ధ | | మి[15] | జో[16] | రం | | బ[17] |
| క | | స[18] | | ప[19] | | ల | | గా[20] | డి |
| | అ[21] | భ్య | ర్థ | న | | పా[22] | న | కం | |
| వా[23] | | త | | స[24] | మ్మె | ట | | రు[25] | తీ |

### పదరంగం-24కి జవాబులు పంపించినవారు

1. యం.వి.రమణకుమారి-హైదరాబాద్; 2. గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడ్-రాజంపేట; 3. వుమ్మా రంగారెడ్డి-హైదరాబాద్; 4.సి.యశ్వంతి, ఎస్.కార్తికేయన్-నిడదవోలు; 5. బి.ఇందుమతి-విజయనగరం

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ..............................

..............................

ఊరు : ..............................


ఇంతకన్నా పెద్ద ఆవాళ్లు లేవు మా దగ్గర.. స్వీకరించండి పీవీ జీ!
Zakir...


నేను బాణం వేసినప్పుడు స్మార్ట్‌గానే కదా ఉన్నావు!?
Zakir...


దేన్ని కొట్టుకు రావాలో తెలీకపోతే ఎలా? ఉన్నది ఇద్దరం.. తినేది పావుకిలో...!?
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'



సముద్ర మట్టానికి పద్నాలుగు వేల అడుగుల ఎత్తులో ఉన్న రహదారి నాథులా. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్ నుంచి అరవై కిలోమీటర్ల దూరంలో ఉందీ దారి. మంచుకొండల నడుమ మలుపులు తిరిగిన ఈ రోడ్డు ప్రయాణం జీవితంలో మరిచిపోలేని అనుభూతులను మిగిలిస్తుంది.











